http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

సోమవారం 1 డిసెంబర్ 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 8 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# భవిష్యత్తు కోసం పారదర్శక పాలసీలు

- బలమైన ఆర్థిక రాష్ట్రంగా నిలదొక్కుకునేందుకు విజన్ డాక్యుమెంట్ తయారీ
- 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా చర్యలు
- డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు
- డిసెంబర్ 9వ తేదీన విజన్ డాక్యుమెంట్ విడుదల
- సంక్షేమ పథకాల అమలుకు విజన్ డాక్యుమెంట్ రూపకల్పన చేస్తున్నాం
- విజన్ డాక్యుమెంట్-2047లో రెండు ప్రధాన అంశాలుగా విజన్, స్ట్రాటజీ ఉన్నాయి
- గ్రేటర్ హైదరాబాద్‌లో 4 రకాలుగా స్థానిక సంస్థల పాలన జరిగేది



హైదరాబాద్

గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పారదర్శక విధానలతో అద్భుతమైన పాలసీని జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ బలమైన ఆర్థిక రాష్ట్రంగా నిలదొక్కుకునేందుకు విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. సంక్షేమ పథకాల అమలుకు విజన్ డాక్యుమెంట్ రూపకల్పన చేస్తున్నామని, విజన్ డాక్యుమెంట్-2047లో రెండు ప్రధాన అంశాలుగా విజన్, స్ట్రాటజీ ఉన్నాయని సీఎం రేవంత్ తెలిపారు. ప్రణాళికబద్ధమైన అభివృద్ధికి పారదర్శక పాలసీలు ఉండాలని పేర్కొన్నారు. పాలసీలకు పెరాలసిస్ వస్తే పెట్టుబడులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. విజన్ డాక్యుమెంట్‌లో లక్షలాది మందిని భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. ఐఎస్‌బీ, నీతిఆయోగ్ సంస్థల సహకారంతో విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నామని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 4 రకాలుగా స్థానిక సంస్థల పాలన జరిగేదని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణను 3 విభాగాలుగా విభజించుకున్నట్లు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాలపై ప్రణాళికబద్ధమైన అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ప్రాంత అభివృద్ధికి చర్యలు - మిగతా3లో



# 5 ప్యాకేజీలుగా ఆర్ఆర్ఆర్ పనులు

- ఉత్తర భాగానికి మరోసారి బిడ్‌ల ఆహ్వానం
- ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం నిర్మాణానికి బిడ్‌ల ఆహ్వానం
- ఆరు వరుసల్లో 161.518 కి.మీ. మేర రహదారి నిర్మాణం
- జనవరి 15 వరకు దరఖాస్తులకు చివరి తేదీ


హైదరాబాద్

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం నిర్మాణం పనులకు మరోసారి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) బిడ్‌లను ఆహ్వానించింది. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలోని తంగడ్?పల్లి వరకు మొత్తం 161.518 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ రీజినల్ ఎక్స్‌ప్రెస్‌వేగా అభివృద్ధి చేయనుంది. దీన్ని ఆరు వరుసలుగా నిర్మించనుంది. దీన్ని మొత్తం ఐదు ప్యాకేజీలుగా విభజించి, ఏక కాలంలో పనులు చేపట్టాలని ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించింది. ఒక్కో ప్యాకేజీకి వేర్వేరుగా టెండర్లను ఆహ్వానించింది. ఈ పనులను హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హ్యామ్) - మిగతా3లో

### తెలంగాణ పంచాయతీ ఎన్నికలు...

# తొలి విడతకు వెల్లువెత్తిన నామినేషన్లు

- తొలి విడత పంచాయతీ ఎన్నికలకు 25 వేలకు పైగా నామినేషన్లు దాఖలు
- 4,236 గ్రామ పంచాయతీలకు కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ
- డిసెంబర్ 11న తొలి దశ పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- మొత్తం మూడు విడతల్లో 12,728 పంచాయతీలకు ఎన్నికలు
- కేంద్ర నిధుల కోసమే ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ



హైదరాబాద్

తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడతకు నామినేషన్ల పర్వం ముగిసింది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో డిసెంబర్ 11న జరగనున్న మొదటి దశ ఎన్నికల కోసం సర్పంచ్ పదవులకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 4,236 గ్రామ పంచాయతీలకు గాను 25,654 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నామినేషన్ల చివరి రోజైన శనివారం ఒక్కరోజే 17,940 మంది తమ పత్రాలు సమర్పించడం విశేషం. అటు వార్డు సభ్యుల స్థానాలకు కూడా తీవ్రమైన పోటీ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 37,440 వార్డులకు - మిగతా3లో




### పరిశోధన రంగంలో

# భారత్ సత్తా చాటుతోంది

- మన్ కీ బాత్ 128వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రపంచంలో ఏదైనా సాధించే సత్తా భారత్‌కు ఉంది
- మన యువత అసమాన శక్తి, బలమైన సంకల్పంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోంది
- కష్టతరమైన వాటిని కూడా భారత్ సాధిస్తోంది
- స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి సంస్కరణలతో భారత యువత వికసిత్ భారత్ కల సాకారం

# పార్లమెంట్‌లో 14 బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్రం

- అణుశక్తి రంగంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని అనుమతించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం
- భారత ఉన్నత విద్యా కమిషన్ బిల్లు 2025 కూడా ప్రాధాన్యత సంతరించుకున్నది
- పతిపాదిత అణుశక్తి బిల్లు 2025 ఇందులో కీలకమైనది



### రోడ్డు ప్రమాదాలే జరగకుండా

# ప్రణాళిక

## 'విజన్ 2047' సిద్ధం చేసిన తెలంగాణ సర్కార్

- రాష్ట్రంలో ఏటా 22 నుంచి 23 వేల రోడ్డు ప్రమాదాలు
- ప్రభుత్వం నూతన విధానం అమల్లోకి వస్తే తగ్గుముఖం పట్టనున్న రోడ్డు ప్రమాదాలు
- దాంతో స్మార్ట్‌గా ట్రావెల్ చేయవచ్చు
- ప్రపంచస్థాయి ట్రాన్స్‌పోర్ట్ అకాడమీకి సన్నాహాలు




హైదరాబాద్

రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్య సాధనలో రహదారి భద్రత కీలకం కానుంది. రోడ్డు ప్రమాదంలో మరణాల్ని సున్నాకు తగ్గించాలన్న ప్రధాన లక్ష్యాన్ని రవాణాశాఖ కలిగి ఉంది. అందుకోసం 'విజన్-2047' ప్రణాళిక రూపొందించింది. వాహనదారులు, పరిశ్రమలు, లాజిస్టిక్ రంగాల అవసరాల్ని దృష్టిలో పెట్టుకుని రోడ్‌మ్యాప్‌ను రూపొందించింది. ఈ విధానం అమల్లోకి వస్తే రాష్ట్రంలో సురక్షితంగా, స్మార్ట్‌గా ప్రయాణాలు చేయవచ్చు. రోడ్లపై నిత్యం నియమ నిబంధనలు పాటించకుండా కొందరు, అనుకోకుండా ప్రమాదాలు జరిగి మరికొందరు చనిపోతున్నారు. ఈ రోడ్ యాక్సిడెంట్‌లు బాధితుల కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగుల్చుతున్నాయి. అంతేకాదు వారికి సామాజిక, ఆర్థిక నష్టాన్ని - మిగతా3లో

# నక్సల్ ఉద్యమానికి మరో దెబ్బ...

- 37 మంది మావోయిస్టుల లొంగుబాటు
- ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో 37 మంది మావోయిస్టులు లొంగుబాటు
- వీరిలో 27 మందిపై మొత్తం రూ. 65 లక్షల రివార్డు
- ప్రభుత్వ 'పూనా మర్గం' పునరావాస విధానంతోనే మార్పు
- లొంగిపోయిన వారికి రూ. 50 వేల ఆర్థిక సాయం, ఇతర ప్రయోజనాలు
- గ్రామస్తుల మద్దతు కరువవడంతోనే లొంగుబాటని వెల్లడి



# పార్లమెంట్‌లో 14 బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్రం



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో 14 బిల్లులు ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రతిపాదిత అణుశక్తి బిల్లు 2025 ఇందులో కీలకమైనది. అణుశక్తి రంగంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని అనుమతించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. భారత ఉన్నత విద్యా కమిషన్ బిల్లు 2025 కూడా ప్రాధాన్యత సంతరించుకున్నది. యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలకు స్వయంప్రతిపత్తిని ప్రోత్సహించడానికి, పారదర్శక అక్రిడిటేషన్ విధానాలు, విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు బలమైన నియంత్రణ పర్యవేక్షణ కోసం కేంద్ర కమిషన్ ఏర్పాటు చేయడం లక్ష్యంగా ఈ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనున్నది.

కాగా, ఇతర బిల్లుల జాబితాలో జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు 2025, దివాలా మరియు దివాలా కోడ్ (సవరణ) బిల్లు 2025, ఆర్డినెన్స్ స్థానంలో మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (రెండవ సవరణ) బిల్లు 2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు 2025 ఉన్నాయి.

మరోవైపు కంపెనీల చట్టం 2013, ఎల్ఎల్‌పీ చట్టం 2008లోని నిబంధనలను సవరించడానికి ఉద్దేశించిన కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లు 2025, సెబీ చట్టం 1992, డిపాజిటరీల చట్టం 1996, సెక్యూరిటీ కాంట్రాక్టుల (నియంత్రణ) చట్టం 1956లను ఏకీకృత మార్కెట్ కోడ్‌గా ఏకీకృతం చేయడానికి ఉద్దేశించిన సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు 2025, బీమా చట్టాలు (సవరణ) బిల్లు 2025 కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

కాగా, ఇటీవలి సుప్రీంకోర్టు పరిశీలనల తర్వాత సెక్షన్ 34తో సహా ఆర్బిట్రేషన్, రాజీ చట్టానికి సవరణలను ప్రతిపాదించే ఆర్బిట్రేషన్ మరియు రాజీ (సవరణ) బిల్లు 2025, సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు 2025, హెల్త్ సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025 కూడా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నది. అయితే వివాదం నేపథ్యంలో చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి నేరుగా రాష్ట్రపతికి అధికారం ఇచ్చే బిల్లు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నది.

# భానుడి తాకిడికి ఎ320 విమానాల విలవిల!




చిన్నపాటి పక్షుల ఢీ ఘటనల పట్లే కాకుండా చిన్నపాటి సాఫ్ట్‌వేర్ వైరుధ్యాల విషయంలోనూ విమాన సంస్థలు అప్రమత్తంగా ఉండాలని జెట్‌బ్లూ సంస్థకు చెందిన ఎయిర్‌బస్ ఎ320 ఎయిర్‌క్రాఫ్ట్ ఉదంతం స్పష్టంచేస్తోంది. అక్టోబరు 30న ఈ లోహవిహంగం పైలట్ ప్రమేయం లేకుండానే అనూహ్యంగా ఆకాశం నుంచి కిందకి జారిపోవడం మొదలైంది. ఎయిర్‌క్రాఫ్ట్‌లోని సాఫ్ట్‌వేర్‌పై తీవ్రస్థాయి సౌరరేడియోధార్మికత ప్రభావం చూపడమే దీనికి కారణమని తేలడం నిపుణులను విస్మయానికి గురిచేసింది. విమాన డిజైన్ సమయంలో మరింత పకడ్బందీగా వ్యవహరించాల్సిన ఆవశ్యకతను ఇది సూచిస్తోంది.

**ఎందుకీ సమస్య?**

ఎ320 విమానాన్ని తొలిసారిగా 1984లో ప్రవేశపెట్టారు. ఫ్లై-బై-వైర్ అనే కంప్యూటరైజ్డ్ ఫ్లైట్ కంట్రోల్ వ్యవస్థ కలిగిన తొలి వాణిజ్య ఎయిర్‌క్రాఫ్ట్‌గా ఇది గుర్తింపు పొందింది.

నింగిలో ఈ విమాన గమనాన్ని మార్చాలనుకున్నప్పుడు పైలట్.. కాక్‌పిట్‌లోని నియంత్రణ వ్యవస్థలను నిర్దేశిత రీతిలో కదిలిస్తారు. దీనికి అనుగుణంగా కంట్రోల్ వ్యవస్థలు ఎలక్ట్రానిక్ సంకేతాలను పంపుతాయి.

ఈ సంకేతాలను ఎలివేటర్ అండ్ ఎయిలిరాన్ కంప్యూటర్ (ఈల్యాక్) ప్రాసెస్ చేస్తుంది. పైలట్ నిర్దేశానికి అనుగుణంగా ఎలివేటర్లు, ఎయిలిరాన్లను సర్దుబాటు చేస్తుంది. ఎలివేటర్‌లో కదలికల ద్వారా విమానాన్ని పైకి లేదా కిందకి వెళ్లేలా చేయవచ్చు. ఎయిలిరాన్లలో మార్పుల ద్వారా ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఎడమ లేదా కుడి వైపునకు మళ్లించొచ్చు.

మొత్తంమీద ఈల్యాక్ వ్యవస్థ అనేది ఎలివేటర్, ఎయిలిరాన్లను నియంత్రించే మెదడు లాంటిది. ఇది గందరగోళానికి లోనైతే పైలట్ ప్రమేయం లేకుండానే ఈ రెండు వ్యవస్థల్లో మార్పులు జరిగి, విమాన గమనంలో ఆకస్మిక మార్పులు రావొచ్చు. ఫలితంగా ఎయిర్‌క్రాఫ్ట్ ఆకృతి పటిష్ఠతపై కూడా ప్రభావం పడొచ్చు. బోయింగ్ సంస్థకు చెందిన 737 మ్యాక్స్ విమానాల్లోనూ ఫ్లైట్ కంట్రోల్ సాఫ్ట్‌వేర్‌లో లోపాలు తలెత్తి, ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆ శ్రేణి విమానాలను సుదీర్ఘ సమయం పాటు నిలిపివేశారు.

**సాఫ్ట్‌వేర్‌లో లోపంతో..**

ఎయిర్‌బస్‌కు చెందిన ఎ320 తరగతి విమానాల్లో ఎల్104 అనే సాఫ్ట్‌వేర్ వెర్షన్‌ను ప్రవేశపెట్టారు. ఈ సాఫ్ట్‌వేర్ తీవ్రస్థాయి సౌర జ్వాలల ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉందని నిపుణులు తాజాగా పేర్కొన్నారు. దీనివల్ల.. అసాధారణ సందర్భాల్లో పైలట్ ప్రమేయం లేకుండానే ఎలివేటర్, ఎయిలిరాన్లలో ఆకస్మిక మార్పులు జరగొచ్చని తేల్చారు. జెట్‌బ్లూ విమానంలో ఎలివేటర్ ఇదేరీతిలో ఆకస్మికంగా మారడంతో విమానం వేగంగా కిందకి దిగిందని పేర్కొన్నారు. ఈ పరిణామం కొద్దిసేపే సాగింది. అయితే ఈ క్రమంలో విమాన డిజైన్ పరిమితులను అది దాటిపోయింది. ఈలోగా ఎయిర్‌క్రాఫ్ట్‌లోని ఆటోపైలట్.. దాని ప్రయాణ మార్గాన్ని సరిచేసింది.

**ఏమిటీ సౌరజ్వాలలు?**

సూర్యుడి నుంచి వచ్చే ఆవేశిత రేణువులు, విద్యుదయస్కాంత తరంగాలను సౌర రేడియోధార్మికతగా పేర్కొంటారు. ఇందులో దృశ్యకాంతి, అతినీలలోహిత కిరణాలు, ప్రొటాన్లు, ఎలక్ట్రాన్లు వంటి ఆవేశిత రేణువులు ఉంటాయి. కొన్నిసార్లు సూర్యుడి నుంచి విస్ఫోటంలా తీవ్రస్థాయి జ్వాలలు, సౌర తుపాన్లు వెలువడతాయి. ఆ సమయంలో సౌర రేణువులు.. కాంతి వేగంతో భూమిని తాకుతాయి. అయితే భూమికి సంబంధించిన అయస్కాంత క్షేత్రం, దట్టమైన వాతావరణం వల్ల పుడమి మీదున్న జీవానికి, సాంకేతిక పరిజ్ఞానానికి సహజసిద్ధ రక్షణ లభిస్తోంది. విమానాలు ప్రయాణించే ఎత్తయిన ప్రదేశాల్లో ఈ రక్షణ ఒకింత తగ్గుతుంది. సౌర తుపాను బలంగా ఉన్నప్పుడు నేల నుంచి 8.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవేశిత రేణువుల తాకిడి పెరిగి, లోహవిహంగాల ఎలక్ట్రానిక్స్‌పై ప్రభావం పడొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో వేగంగా దూసుకొచ్చే సౌర రేణువులు విమాన ఎలక్ట్రానిక్ వ్యవస్థల్లోకి చొచ్చుకెళ్లే ప్రమాదం ఉంది. ఫలితంగా వాటి మెమరీ వ్యవస్థలోని బిట్‌లలో వైరుధ్యాలు తలెత్తుతాయి. దీన్ని 'బిట్ ఫ్లిప్' అంటారు. దీనివల్ల డేటా కరప్ట్ కావొచ్చు. ఫలితంగా ఎయిర్‌క్రాఫ్ట్‌లోని నేవిగేషన్, కమ్యూనికేషన్, ఫ్లైట్ కంట్రోల్ వ్యవస్థల్లో అవరోధాలు కలగొచ్చు. ఈ నేపథ్యంలో విమానాల డిజైన్‌లో సౌర రేడియోధార్మికతను చాలా ముఖ్యమైన అంశంగా పరిగణిస్తారు.

**మేల్కొలుపు**

విమానాల్లో కీలక వ్యవస్థలకు రిడండెన్సీ ఏర్పాటు ఉంటుంది. ఫలితంగా.. ఒకటి విఫలమైతే మరొకటి అందుబాటులో ఉంటుంది. అయితే చిన్నపాటి సాఫ్ట్‌వేర్ మార్పులు కూడా విమానాన్ని దుర్బలంగా మార్చే వీలుందని జెట్‌బ్లూ ఘటన చెబుతోంది. సౌర జ్వాలలు, తుపాన్ల సమయంలో ఇది మరింత ప్రమాదకరంగా ఉంటుందని తేల్చింది. ప్రస్తుతం సౌర కాలచక్రంలో గరిష్ఠ స్థాయి నడుస్తోంది. ఈ సమయంలో సౌర తుపాన్ల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఏవియానిక్స్ వ్యవస్థల్లో అవరోధాలు, ఉపగ్రహ సేవల్లో ఆటంకాలు, జీపీఎస్ వ్యవస్థ కచ్చితత్వంలో తేడాలు, కొన్ని ప్రయాణ మార్గాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థల్లో అవరోధాలు ఉత్పన్నం కావొచ్చు. ఈ నేపథ్యంలో ఎయిర్‌క్రాఫ్ట్ సాఫ్ట్‌వేర్‌లో రేడియోధార్మికతను తట్టుకునే వెసులుబాటు ఉండాలి. యాంత్రిక సంబంధ ముప్పులతోపాటు అంతరిక్ష ముప్పులనూ తట్టుకునేలా రిడండెన్సీని ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# పరిశోధన రంగంలో భారత్ సత్తా చాటుతోంది



పరిశోధన రంగంలో భారత్ దూసుకుపోతున్నదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచంలో ఏదైనా సాధించే సత్తా భారత్‌కు ఉందని చెప్పారు. మన్ కీ బాత్ 128వ ఎపిసోడ్‌లో ప్రసంగించిన ప్రధాని.. మన యువత అసమాన శక్తి, బలమైన సంకల్పంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని పేర్కొన్నారు.

గత 11 ఏళ్లలో విజ్ఞానం, క్రీడలు, సామాజిక సేవ, సంస్కృతి వంటి వివిధ రంగాల్లో యువత అద్భుతమైన ప్రతిభ కనబరిచారని ప్రధాని ప్రశంసించారు. కష్టతరమైన వాటిని కూడా భారత్ సాధిస్తోందని చెప్పారు. అంధుల మహిళా క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించిందని ప్రశంసించారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి సంస్కరణలతో భారత యువత వికసిత్ భారత్ కలను సాకారం చేస్తారని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు ప్రధాని చెప్పారు.

కొన్ని రోజుల క్రితం సోషల్ మీడియాలోని ఓ వీడియో తన దృష్టిని ఆకర్షించిందని ప్రధాని చెప్పారు. అంగారక గ్రహంపై ఉన్న వాతావరణ పరిస్థితులను కృత్రిమంగా రూపొందించిన చోట డ్రోన్లను ఎగరవేయడానికి మన యువత ప్రయత్నించారని అన్నారు. జీపీఎస్ మద్దతు లేక డ్రోన్‌లు నేలకూలుతున్నప్పటికీ.. పుణెకు చెందిన విద్యార్థుల బృందం పట్టుదలతో పలుమార్లు యత్నించి డ్రోన్లు కొంత సమయం ఎగిరేలా చేసినట్లు వెల్లడించారు. యువతలో ఉన్న ఇలాంటి గొప్ప సంకల్ప బలమే దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చేందుకు తోడ్పడుతుందన్నారు.

## నక్సల్ ఉద్యమానికి మరో దెబ్బ



దంతెవాడ:ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దంతెవాడ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న 'లోన్ వర్రాటు', 'పూనా మర్గం' (పునరావాసం ద్వారా పునరుజ్జీవనం) పథకాలకు ఆకర్షితులై 37 మంది మావోయిస్టులు ఆదివారం లొంగిపోయారు. వీరిలో 27 మందిపై మొత్తం రూ. 65 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు. హింసామార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పునరావాస విధానంపై తమకు పూర్తి నమ్మకం ఉందని లొంగిపోయిన మావోయిస్టులు పేర్కొన్నారు. దంతెవాడలోని డీఆర్‌జీ కార్యాలయంలో పోలీసు, సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారుల సమక్షంలో వీరు లొంగిపోయారు. వీరిలో 12 మంది మహిళలు కూడా ఉన్నారు. వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ మాట్లాడుతూ.. "మా నిరంతర ప్రయత్నాలు, స్థానిక ప్రజల మద్దతు ఫలించాయి. అడవుల్లో జీవించడం కష్టంగా మారిందని, పోలీసులు అన్ని ప్రాంతాలకు చేరుకుంటున్నారని, గ్రామస్తుల నుంచి కూడా మద్దతు లభించడం లేదని లొంగిపోయిన వారు చెబుతున్నారు" అని వివరించారు. లొంగిపోయిన వారిలో కొందరు సీనియర్ మావోయిస్టు కమాండర్లకు బాడీగార్డులుగా పనిచేసిన వారు కూడా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం లొంగిపోయిన వారికి రూ. 50,000 ఆర్థిక సాయంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ, వ్యవసాయ భూమి వంటి అదనపు ప్రయోజనాలు అందిస్తారు. గత 20 నెలల్లో దంతెవాడ జిల్లాలో 165 మంది రివార్డు ఉన్న మావోయిస్టులతో సహా మొత్తం 508 మంది లొంగిపోయారని అధికారులు తెలిపారు. ఈ పరిణామం హింసారహిత బస్తర్ దిశగా వేసిన మరో కీలక అడుగు అని వారు అభివర్ణించారు.

## అఖిలపక్ష సమావేశం నిర్వహించిన కేంద్రం..

## పలు అంశాలపై గళమెత్తనున్న ప్రతిపక్షం



**న్యూఢిల్లీ:** సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదివారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంట్ సమావేశాల గడువు, ప్రవేశపెట్టనున్న బిల్లులతో పాటు ప్రతిపక్షాలు లేవనెత్తనున్న అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. పార్లమెంట్ హౌస్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశానికి కేంద్ర ప్రభుత్వం తరఫు సీనియర్ మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాల్గొన్నారు. ప్రతిపక్షం తరుపున కాంగ్రెస్ నేతలు జైరామ్ రమేష్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీ, ఆర్జేడీకి చెందిన మనోజ్ ఝా, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన డెరెక్ ఓ'బ్రియన్, కళ్యాణ్ బెనర్జీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎంపీ ఈటీ మొహమ్మద్ బషీర్ తదితర నేతలు పాల్గొన్నారు. కాగా, పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1న ప్రారంభమై డిసెంబర్ 19న ముగుస్తాయి. ఈ ఏడాది 15 సమావేశాలకు షెడ్యూల్ చేశారు. సాధారణంగా జరిగే 20 సమావేశాల కంటే ఈ సంఖ్య గణనీయంగా తగ్గింది. మరోవైపు ఎన్నికల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (సర్), ఢిల్లీ కారు బాంబు పేలుడు, ప్రభుత్వ విదేశాంగ విధానాలు, ఇతర అంశాలపై గళమెత్తేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. అయితే సమావేశాల వ్యవధి తక్కువగా ఉండటంతో సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని ప్రభుత్వం కోరింది.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం...

## 11 మంది దుర్మరణం

**శివగంగ జిల్లా తిరుపత్తూర్ సమీపంలో ఘటన**

**కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో పెరగనున్న మృతుల సంఖ్య**

**వారం రోజుల వ్యవధిలోనే ఇది రెండో పెద్ద బస్సు ప్రమాదం**



తమిళనాడులో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శివగంగ జిల్లాలోని తిరుపత్తూర్ సమీపంలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో ఒక చిన్నారితో సహా 11 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ఒక బస్సు తిరుప్పూర్ నుంచి కారైకుడి వస్తుండగా... మరో బస్సు కారైకుడి నుంచి దిండిగల్‌కు ప్రయాణిస్తోంది. తిరుపత్తూర్ వద్దకు రాగానే ఈ రెండు బస్సులు ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను శివగంగ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో వారం రోజుల వ్యవధిలోనే ఇలాంటి ఘోర ప్రమాదం జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. నవంబర్ 24న తెన్కాశి జిల్లాలో రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మహిళలు సహా ఆరుగురు మరణించగా, 56 మంది గాయపడ్డారు. ఆ ప్రమాదానికి డ్రైవర్ అతివేగమే కారణమని పోలీసులు నిర్ధారించారు. ఆ ఘటనలో మృతుల కుటుంబాలకు సీఎం ఎంకే స్టాలిన్ రూ. 3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

# 5 ప్యాకేజీలుగా ఆర్ఆర్ఆర్ పనులు

-మొదటిపేజీ తరువాయి

పద్ధతిలో చేపట్టనున్నారు. ఈ పనులకు సంబంధించిన బిడ్‌లను సమర్పించాలని ఎన్‌హెచ్‌ఏఐ శనివారం ఆహ్వాన నోటీసులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన బిడ్‌లను 2026 జనవరి 15 వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 16న అధికారులు సాంకేతిక బిడ్‌లను తెరుస్తారు. ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించడానికి ఎన్‌హెచ్‌ఏఐ ముగ్గురు విశ్రాంత అధికారులతో స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో విశ్రాంత ఐపీఎస్ అధికారి పర్వేజ్ హయత్, విశ్రాంత ఇండియన్ ఆడిట్, ఎకౌంట్ సర్వీసు అధికారి రాజ్‌వీర్ సింగ్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మాజీ సీఎండీ అరుణ్‌కుమార్ ఉన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లను పిలిచినప్పటికీ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ ఎప్రైజల్ కమిటీ(పీపీపీఏసీ) ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఈ పీపీపీఏసీ ఆమోదం నాటికి మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని జీఎస్టీ మినహాయించారు. ఇలా మినహాయించి రూ.9,590.5 కోట్లుగా చూపించారు. భూసేకరణ, రోడ్డు నిర్మాణ వ్యయం, ఇతర ఖర్చులను కలిపి ఈ ప్రాజెక్టు మొత్తానికి ఎన్?హెచ్?ఏఐ రూ.15,627 కోట్లను వెచ్చిస్తోంది.



**ఎలైన్‌మెంట్ మాత్రం అదే**

గతేడాది డిసెంబర్‌లో గ్రీన్‌ఫీల్డ్ రీజినల్ ఎక్స్‌ప్రెస్‌వేగా 4 వరుసల రహదారి కోసం ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లను పిలిచింది. తర్వాత ట్రాఫిక్ సర్వేకు అనుగుణంగా ఆరు వరుసల రహదారిగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఇప్పుడు నాలుగు వరుసల రహదారినే ఆరు వరుసలుగా విస్తరించనున్నారు. ఎలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పూ ఉండదు.

**మొత్తం 1,933.20 హెక్టార్ల భూసేకరణ**

రహదారిని గంటకు 120 కి.మీ. వేగంతో ప్రయాణించేలా నిర్మించనున్నారు. ఇందులో మొత్తం 187 అండర్ పాస్‌లు, నాలుగు ఆర్వోబీలు, 26 పెద్ద వంతెనలు, 81 చిన్న వంతెనలు, 400 వరకు కల్వర్టులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆరు చోట్ల విశ్రాంత గదులను ఏర్పాటు చేస్తారు. ఈ రహదారికి 1,933.20 హెక్టార్ల భూసేకరణ చేశారు.

**షరతులతో టెండర్లకు ఆహ్వానం**

గతేడాది పిలిచిన నాలుగు వరుసల రహదారి పనుల టెండర్లలో బిడ్‌లు పొందిన సంస్థలు రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని, ఐదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతను చేపట్టాలని షరతు పెట్టింది. తాజాగా ఆరు వరుసల రహదారికి పిలిచిన బిడ్ ఆహ్వాన నోటీసులో ఈ నిబంధన అంశాన్ని కనీసం ప్రస్తావించలేదు. ఇప్పటికే తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణ వేగం తగ్గింది. ఇందుకు కారణాలు లేకపోలేదు. భూసేకరణ వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

# గ్రేటర్‌లో మరిన్ని మల్టీ లెవల్ పార్కింగ్ స్టేషన్లు

**బంజారాహిల్స్:** రానున్న రోజుల్లో గ్రేటర్ పరిధిలో పర్యాటక ప్రదేశాలు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో మరిన్ని మల్టీ లెవల్ పార్కింగ్ స్టేషన్లు నిర్మిస్తామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద జీహెచ్ఎంసీ, నవ నిర్మాణ్ సంస్థ సంయుక్తంగా నిర్మించిన మల్టీ లెవల్ పార్కింగ్ వ్యవస్థను ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిన ఆరు నెలల్లోనే మల్టీ లెవల్ పార్కింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. తక్కువ స్థలంలో ఎక్కువ కార్లు నిలిపేలా స్మార్ట్ కార్ పార్కింగ్ వ్యవస్థను రానున్న రోజుల్లో నగరంలో మరిన్ని చోట్ల పీపీపీ పద్ధతిలో నిర్మిస్తామన్నారు. కేబీఆర్ పార్కు వద్ద నిర్మించిన ఈ పార్కింగ్ సిస్టమ్‌లో ఒకేసారి 72 కార్లు పార్కింగ్ చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, కార్పొరేటర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## మేజర్ పంచాయతీల్లో సర్పంచ్ పదవికి ఫుల్ డిమాండ్

# ఖర్చుకు వెనకాడని రియల్టర్లు

పల్లెలు, గ్రామాల్లో ఓట్ల జాతర మొదలైంది. మొదటి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో నామపత్రాల దాఖలు గడువు శనివారంతో ముగిసింది. మేజర్ పంచాయతీల్లో సర్పంచి పదవికి బరిలో నిలిచే అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల తరహాలో ఉండే ప్రచార హంగామాతో నామినేషన్లను రిటర్నింగ్? అధికారికి సమర్పించారు. నామపత్రాల దాఖలు రోజునే ఎన్నికల సంఘం నిర్దేశించిన ఖర్చును దాటేస్తున్నారు. తమకున్న పరిధిని దాటి హామీలు గుప్పిస్తున్నారు. రూ.కోట్లు వ్యయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. రియల్? ఎస్టేట్? వ్యాపారం కొనసాగుతున్న గ్రామాలు, పరిశ్రమలున్న పల్లెల్లో సర్పంచి పదవిని కైవసం చేసుకునేందుకు అన్ని పార్టీల నాయకులు పెద్దఎత్తున ఖర్చు చేసేందుకు వెనుకాడని పరిస్థితి నెలకొంది.

**స్థిరాస్తి వ్యాపారమున్న ప్రాంతాల్లో అధికం**

సంగారెడ్డి, పటాన్‌చెరు వంటి నియోజకవర్గాలు, హత్నూర మండలంలోని మేజర్ పంచాయతీలున్న గ్రామాల్లో అభ్యర్థులు భారీగా వ్యయం చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ దిశగా హామీలను ప్రజలపై గుప్పిస్తున్నారు. హెచ్ఎండీఏ (హైదరాబాద్? మెట్రోపాలిటన్? డెవలప్?మెంట్ అథారిటీ) పరిధిలో ఉన్న ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో ఈ పల్లెల్లో పోరు అన్నింటికంటే రసవత్తరంగా మారే అవకాశం ఉంది.

మెదక్ జిల్లాలోని మొదటి విడతలో జరిగే ఎన్నికల్లో రేగోడ్,



పెద్దశంకరంపేట, టేక్మల్, అల్లాదుర్గం వంటి పంచాయతీల్లో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వ్యయం చేసేందుకు అభ్యర్థులు సర్వసన్నద్ధంగా ఉన్నట్లు ప్రకటిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో మొదటి విడత ఎన్నికలు జరిగే కొన్ని మండల కేంద్రాలలో భారీగా పోటీ నెలకొంది. వర్గల్ మండలంలోని గౌరారం, ములుగు మండలం కొత్తూరు, మర్కుక్ మండల కర్కపట్లలో సర్పంచి పదవుల కోసం ఎంత వ్యయం అయినా సరే భరించేందుకు అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారు.

**ఏకగ్రీవాల కోసం**

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామపంచాయతీల్లో సర్పంచి పీఠాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకునేందుకు పలువురు అభ్యర్థులు భారీగా ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సిద్దిపేట జిల్లాలోని జగదేవ్‌పూర్, రాయిపోల్, వర్గల్ మండలాల్లోని కొన్ని చోట్ల ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకొని కేవలం ఒక్కరే నామపత్రాలు దాఖలు చేసినట్లు సమాచారం. ఏకగ్రీవం కోసం రూ.15 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు వెచ్చించినట్లు తెలుస్తోంది. హత్నూర మండలంలోని రెండు తండాల్లో ఏకంగా ఎన్నికలు లేకుండానే పదవులు దక్కించుకునేందుకు ఎత్తులు వేస్తున్నట్లు సమాచారం.

**దెబ్బతీసిన రిజర్వేషన్లు**

సర్పంచులుగా పోటీ చేయాలని చాలా మంది రెండేళ్ల నుంచి ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూశారు. ఆయా గ్రామాల్లో సర్పంచి స్థానాలకు ఇటీవల ప్రకటించిన రిజర్వేషన్ అభ్యర్థులకు అనుకూలంగా రాకపోవడంతో వారు తీవ్ర నిరాశకు లోనయ్యారు. దీంతో ఆశావహులు తగ్గడంతో ప్రధానంగా పలు గ్రామాల్లో ప్రధాన పార్టీల నుంచి బలమైన అభ్యర్థులే కనిపించడం లేదు. దీంతో స్వతంత్ర్య అభ్యర్థుల వైపు రాజకీయ పార్టీల చూపు మళ్లింది. స్థానిక కార్యకర్తల బలంతో గెలిపించాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

గ్రామాల్లో యువత నుంచి పెద్దల వరకు ఎన్నికలపై రాత్రి, పగలు పోటీలో ఉండే అభ్యర్థులపై సమూహంగా చర్చలు సాగిస్తున్నారు. ఈసారి సర్పంచిగా ఎవరు నిలబడుతున్నారు, ఎవరూ పోటీకి సరైన వారు, ఎవరికి మద్దతు ఇవ్వాలి అనే చర్చలు నడుస్తున్నాయి. పార్టీలు, కులసంఘాల నాయకులు

# బేకర్స్ ఫన్‌లో సందడిగా కేక్ మిక్సింగ్

**ఉత్సాహంగా పాల్గొన్న పిల్లలు, పెద్దలు**

**డ్రైఫ్రూట్స్‌ను ప్రత్యేక సిరప్‌తో కలిపిన పిల్లలు**

**ప్రీక్రిస్మస్, క్రిస్మస్, కొత్త సంవత్సర వేడుకలకు సిద్ధం**

**హైదరాబాద్:** త్వరలో రాబోతున్న ప్రీ క్రిస్మస్, క్రిస్మస్, కొత్త సంవత్సరాలకు ఇప్పటినుంచే రంగం సిద్ధమవుతోంది. నగరంలోని తెల్లాపూర్‌లో గల బేకర్స్ ఫన్‌లో కేక్ మిక్సింగ్ సందడి మొదలైంది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దాదాపు 30 మంది వరకు పిల్లలు, పెద్దలు అందరూ ఈ కార్యక్రమానికి వచ్చి ఎంతో ఉత్సాహంగా కేక్ మిక్సింగ్‌లో పాల్గొన్నారు. ఒకప్పుడు పాశ్చాత్య దేశాలకే పరిమితమైన ఈ కేక్ మిక్సింగ్ ఈవెంట్.. ఇటీవలి కాలంలో మన నగరంలోనూ పెద్దపెద్ద హోటళ్లలో నిర్వహిస్తున్నారు. తెల్లాపూర్‌లోని బేకర్స్ ఫన్ యాజమాన్యం ఈసారి వినూత్నంగా కస్టమర్లతోనే ఈ కేక్ మిక్సింగ్ చేయించారు. జీడిపప్పులు, బాదం పప్పులు, కిస్మిస్‌లు, డ్రైడ్ కివీ.. ఇంకా అనేక రకాల డ్రైఫ్రూట్స్ అన్నింటినీ తీసుకుని, వాటిని బేకర్స్ ఫన్ వారి ప్రత్యేకమైన సిరప్‌తో బాగా కలిపారు. దానికితోడు పలు రకాల రంగులతో ఉండే చెర్రీస్ తీసుకుని.. వాటితో బేకర్స్ ఫన్ లోగోను కూడా రూపొందించారు. ఈ సిరప్‌లో వీటన్నింటినీ దాదాపు నెల రోజుల పాటు నానబెడతారు. తర్వాత తయారుచేసే రిచ్ ప్లమ్ కేక్‌లో



వీటిని కలిపి బేక్ చేస్తారు. అసలు తాము ఈ కొత్త సంవత్సర, క్రిస్మస్ కేకులు ఎలా తయారుచేస్తామన్న విధానాన్ని కస్టమర్లకు కూడా తెలియజేయడం, వారిని కూడా ఈ యాక్టివిటీలో భాగస్వాములను చేయడం కోసమే కేక్ మిక్సింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు కంపెనీ డైరెక్టర్ శ్రీమతి హారిక తెలిపారు. ఈ సందర్భంగా వచ్చిన కస్టమర్లందరితో కొన్ని సరదా కార్యక్రమాలు నిర్వహించి, అందరికీ బహుమతులు కూడా పంచారు.

## తెలంగాణ పంచాయతీ ఎన్నికలు...

## తొలి విడతకు వెల్లువెత్తిన నామినేషన్లు

-మొదటిపేజీ తరువాయి

82,276 నామినేషన్లు దాఖలయ్యాయని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం వెల్లడించింది. ప్రస్తుతం అధికారులు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. అర్హులైన అభ్యర్థుల జాబితాను ఆదివారం రాత్రికి ప్రకటించే అవకాశం ఉంది. నామినేషన్లపై అభ్యంతరాలను డిసెంబర్ 1న స్వీకరించి, 2వ తేదీన పరిష్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 4 చివరి తేదీ. షెడ్యూల్ ప్రకారం తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. రాష్ట్రంలో మొత్తం 12,728 గ్రామ పంచాయతీలకు, 1,12,242 వార్డులకు మూడు దశల్లో (డిసెంబర్ 11, 14, 17) ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.3,000 కోట్ల నిధులు 2026 మార్చి 31కి మురిగిపోనున్న నేపథ్యంలో, రాష్ట్ర కేబినెట్ ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తుది తీర్పు వచ్చిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై నిర్ణయం తీసుకోనున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా, బీసీలకు 17.08 శాతం రిజర్వేషన్లు కేటాయించారు.

## రోడ్డు ప్రమాదాలే జరగకుండా ప్రణాళిక




-మొదటిపేజీ తరువాయి

కలిగిస్తున్నాయి. తెలంగాణలో ప్రతీ ఏటా సగటున 22,000 నుంచి 23,000 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అందులో 7,500 నుంచి 7,800 మంది మరణిస్తున్నారు. 4,40,000 పైగా గాయపడుతున్నారు.

**ప్రపంచస్థాయి ట్రాన్స్‌పోర్ట్ అకాడమీకి సన్నాహాలు**

తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచస్థాయి ట్రాన్స్‌పోర్ట్ అకాడమీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రణాళిక తయారు చేసింది. ఇందులో డ్రైవింగ్, రోడ్‌సేఫ్టీలో ప్రత్యేక నైపుణ్య కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని ఐదు లక్షల మంది భారీ వాహనాల డ్రైవర్లకు దశలవారీగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకుగాను డ్రైవింగ్ ట్రైనింగ్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐడీటీఆర్)లు ఏర్పాటు చేయనున్నారు.

**జాతీయ రహదారుల్లో పీపీపీ విధానం**

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రక్ టెర్మినల్స్, పార్కింగ్ యార్డులను డ్రై పోర్టులుగా అభివృద్ధి చేస్తారు. దీనికోసం విజయవాడ, కర్నూలు, వరంగల్, నిజామాబాద్, ముంబయి జాతీయ రహదారుల్లోని ప్రాంతాలను గుర్తించి పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ తగ్గించటం కోసం, ప్రయాణికులకు పీపీపీ ద్వారా మెరుగైన సౌకర్యాన్ని ప్రైవేట్ బస్ స్టేషన్ల నిర్మాణం ద్వారా చేపడతారు. కాలుష్య సమస్య నివారించటానికి పబ్లిక్, ప్రైవేట్, కమర్షియల్ ట్రాన్స్‌పోర్ట్ రంగాల్లో 2047 నాటికి 50 శాతం వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చాలన్నది లక్ష్యం. రాష్ట్రంలో ఆర్టీఓ కార్యాలయాలను పూర్తిస్థాయి డిజిటల్ సేవలు అందించేలా ఆధునికీకరించనున్నారు.

ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏఐ సేఫ్టీ సిస్టమ్ : రోడ్డు ప్రమాదాల్లో మరణాలను 2035 నాటికి 50 శాతం తగ్గించడమనేది ప్రభుత్వం మొదటి లక్ష్యం. 2047 నాటికి సున్నా మరణాలు సాధించడం అనేది అంతిమ లక్ష్యం. వీటి సాధనకు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఐ ఆధారిత సేఫ్టీ వ్యవస్థలను ప్రవేశపెట్టాలనే ప్రణాళిక తయారు చేసింది. ఇందుకు ఏఐ ఆధారిత ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్(ఏఎన్‌పీఆర్) కెమెరాలను ఏర్పాటు చేస్తారు. స్పీడ్ మానిటరింగ్, ప్రమాద ప్రాంతాలను సరిదిద్దడానికి సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమాండ్ సెంటర్స్ ఉంటాయి.

**మహిళలు, పిల్లల భద్రతకు**

మహిళలు, పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకొని 24/7 పర్యవేక్షణకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సిద్ధం చేయనున్నారు. ఇది వెహికిల్ లోకేషన్ ట్రాకింగ్ డివైజ్(వీఎల్‌టీడీ)ల ద్వారా మహిళలు, పిల్లలు, ఇతరులు ప్రయాణించే వాహనాలను 24 గంటలు పర్యవేక్షించటానికి ఉపయోగపడుతుంది. దీని కోసం నిర్భయ కమాండ్ సెంటర్ ఏర్పాటు చేస్తారు. వీఎల్‌టీడీ ఉన్న అన్ని వాహనాల సమగ్ర సమాచారాన్ని దీనికి అనుసంధానిస్తారు. షీ టీమ్స్, అత్యవసర సేవలతో ఎస్ఓఎస్ ఎలర్ట్ అనుసంధానం చేస్తారు.

## భవిష్యత్తు కోసం పారదర్శక పాలసీలు



-మొదటిపేజీ తరువాయి

చేపడుతున్నామన్నారు. నెట్ జీరో సిటీ, కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను మార్చాలని ఆయన పేర్కొన్నారు. కోర్ అర్బన్ రీజియన్‌లో సంక్షోభాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**మరిన్ని విమానాశ్రాయాలు వస్తాయి**

కోర్ అర్బన్ రీజియన్ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా మారుస్తున్నామని, దీన్ని యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి పేర్కొన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవేలు, బుల్లెట్ రైళ్ల కోసం కేంద్రాన్ని ఒప్పిస్తున్నామన్నారు. తెలంగాణకు మరిన్ని విమానాశ్రయాలు రావాల్సి ఉందన్నారు. తెలంగాణలో మరో 4 విమానాశ్రయాలు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండంలో ఎయిర్‌పోర్టులు త్వరలో రాబోతున్నాయన్నారు.

**క్యూర్, ప్యూర్, రేర్ పాలసీలు**

హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కోసం కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని రేవంత్? రెడ్డి అన్నారు. హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ ద్వారా పెట్టుబడులను ఆకర్షించనున్నట్లు తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తామని, కొత్తగా క్యూర్, ప్యూర్, రేర్ పాలసీలు తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. మూడు అంశాలతో తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేస్తున్నామన్నారు. ఆదాయం పెంచి పేదలకు పంచే విధానంతో బలమైన ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తయారు చేస్తామన్నారు.

**ఉప్పల్ స్టేడియంలో మెస్సీ ఫుట్‌బాల్**

డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో విజన్ డాక్యుమెంట్ స్టాళ్లను నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. విజన్ డాక్యుమెంట్ స్టాళ్లను పెద్దఎత్తున ప్రజలు సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డిసెంబర్ 13న ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీ హైదరాబాద్ వస్తున్నారని, ఉప్పల్ స్టేడియంలో ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఆయన ఆడతారని తెలిపారు.

అగ్నిధార
http://www.agnidharanews.com
నిజాల నిప్పు కణిక

## సంపాదకీయం

# కన్నడలో కుర్చీలాట

కర్ణాటక రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. మొన్నటిదా కా అధిష్ఠానం మాటకు కట్టుబడి ఉన్నామని అటు సీఎం సిద్ధరామయ్య.. ఇటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ గంభీరంగా పేర్కొన్నప్పటికీ లోలోపల మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. హైకమాండ్ మాటకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్న డీకే శివ కుమార్ తాజాగా తన 'ఎక్స్' ఖాతాలో 'ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడ మే ప్రపంచంలో పెద్ద శక్తి' అని ట్వీట్ చేశారు. దీనికి కౌంటర్‌గా సిద్ధరామయ్య.. 'మేము కర్ణాటకకు ఇచ్చిన మాట కేవలం నినాదం కాదు.. అదే మాకు సర్వస్వం' అని ట్వీట్ చేశారుఈ పరిణామాల నేపథ్యంలోనే కన్నడ రాజకీయం ఢిల్లీకి మారింది. 2023లో కర్ణాటకకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీకి మించి 23 సీట్లు అధికంగా సాధించి కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చింది. కర్ణాటకలో కాంగ్రెస్ విజయానికి సిద్ధరామయ్యతో పాటు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడైన డీకే శివకుమార్ శక్తికి మించి పనిచేశారు. దీంతో ఐదేళ్ల పాలనలో రెండున్నరేళ్లు పూర్తి కాగానే అధికార మార్పిడి జరగాలని ఒప్పందం కుదిరింది. ఒప్పందం మేరకు సిద్ధరామయ్య ఈ ఏడాది నవంబర్ వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి ఆ తర్వాత సీఎం పగ్గాలను డీకేకు అప్పగించాలికానీ సిద్ధరామయ్య పార్టీ కేంద్ర నాయకత్వంతో భేటీ అయ్యి ఐదేళ్లు తానే సీఎంగా ఉండేలా అనుమతులు తెచ్చుకోవడంలో తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తూ వచ్చారు. ఇదే సమయంలో డిప్యూ టీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్ కూడా సీఎం కుర్చీని వదులుకునేందుకు సిద్ధంగా లేరనిపించింది. నిజానికి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో డీకే పాత్ర మరువలేనిది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అన్ని వర్గాలను కలుపుకుని పోయి సమన్వయంతో వ్యవహరించి పార్టీని విజయపథంలో నడిపించారు. అయితే అపార పరిపాలన అనుభవం కలిగిన సిద్ధరామయ్యకే సీఎం పదవి ఇచ్చేందుకు అధిష్ఠానం మొగ్గుచూపింది. హైకమాండ్ ఆదేశాలను తాను శిరసావహిస్తానని డీకే చెప్పడంతో సమస్య చల్లబడినట్లుగా అనిపించింది. ఈ నవంబర్ 20తో కర్ణాటకలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తి కావడంతో అధికార మార్పిడి అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. శివకుమార్‌ను పొలిటికల్ మాస్టర్ మైండ్‌గా అభివర్ణించినప్పటికీ.. పాలన విషయంలో సిద్ధరామయ్య ఒక మెట్టు ముందు ఉంటారు. జనతాదళ్ నుంచి బహిష్కరణకు గురై 2006లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న సిద్ధరామయ్య పార్టీలో అగ్రస్థానానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి పీఠం కోసం సిద్ధరామయ్య , డీకే శివకుమార్ మధ్య పోరు కొనసాగుతుండగా ఉప ముఖ్యమంత్రికి పదోన్నతి కల్పించాలని కోరేందుకు ఆయన మద్దతుదారులు ఢిల్లీకి క్యూ కడుతున్నారు. కాగా పార్టీ అధిష్టానం నిర్ణయిస్తే ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని సిద్ధరామయ్య సోమవారం వెల్లడించారు. ఇప్పటికే ఢిల్లీలో మకాం వేసిన కొందరు ఎమ్మెల్యేలకు అదనంగా డీకే శిబిరానికి చెందిన మరో ఆరుగురు ఎమ్మెల్యేలు సోమవారం ఢిల్లీ చేరుకోగా మరికొందరు కూడా హస్తిన బాట పట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా నాయకత్వ మార్పుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని, దాన్ని తనతోపాటు డిప్యూటీ సీఎం కూడా అంగీకరించక తప్పదని సిద్ధరామయ్య విలేకరులకు చెప్పారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి మేము కట్టుబడి ఉంటాం. నవంబర్ 20వ తేదీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లు పూర్తి కావడంతో ముఖ్యమంత్రి మార్పు జరగవచ్చని జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. మరోవైపు తాను కూడా ముఖ్యమంత్రి రేసులో ఉన్నానంటూ మాజీ కేపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర హోం మంత్రి జీ పరమేశ్వర ప్రకటించడం కలకలం రేపుతోంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాటలు తనకు వేద వాక్యం లాంటివని శివకుమార్ సోమవారం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు గురించి జోరుగా ఊహాగానాలు సాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తే తాను ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని, అధిష్టానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను, డీకే శివకుమార్ కట్టుబడి ఉండాల్సి ఉంటుందని సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలపై సోమవారం విలేకరులు ప్రశ్నించినపుడు తాను కూడా ముఖ్యమంత్రి ప్రకటనతో ఏకీభవిస్తున్నానని డీకే చెప్పారు. 2013లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంతో పాటు సీఎంగా ఐదేళ్ల పాటు ప్రభుత్వాన్ని సమర్థంగా నడిపించారు. ఇటు సిద్ధూ.. అటు డీకేల్లో ఉన్న ప్రత్యేక లక్షణాలే ఇవాళ హైకమాండ్‌కు సీఎం మార్పు తలనొప్పిగా మారిపోయింది. 2006లో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. పాలనా ఒప్పందంలో భాగంగా రెండున్నరేళు పూర్తయిన తర్వాత జేడీఎస్ అధినేత కుమారస్వామి అయిష్టంగానే సీఎం పదవి నుంచి తప్పుకొని ఆ బాధ్యతలు బీఎస్ యడ్యూరప్పకు అప్పగించారు. ప్రస్తుతానికి సీఎం సిద్ధరామయ్య పదవికి ఎలాంటి ముప్పు లేదని తెలుస్తోంది. కర్ణాటక రాష్టంలో ఓబీసీలదే రాజ్యమని కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలుసని నివేదికలు చెబుతున్నాయి ఆయనకు అహింద వర్గంతో పాటు పార్టీలోని 100 మందికి పైగా ఎమ్మెల్యేల మద్దతు ఉంది. కాంగ్రెస్ పార్టీకి సభలో మొత్తం 137 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ క్రమంలో సిద్ధరామయ్య అంగీకారం లేకుండా ముఖ్యమంత్రిని మార్చడం అనేది చాలా కష్టం. కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల సమాఖ్య కాంగ్రెస్‌ను హెచ్చరించింది. రాష్ట్ర యూనిట్‌లో అంతర్గత కలహాల నేపథ్యంలో సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తొలగించడానికి ఏ ప్రయత్నం చేసినా అది పార్టీపై ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. మరోవైపు కర్ణాటక రాష్ట్ర వొక్కలిగ సంఘం కూడా ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్న ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌కు అన్యాయం జరిగితే.. వారు దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించింది. ముఖ్యమంత్రిని మార్చాలని సిద్ధరామయ్య వర్గంపై ఒత్తిడి తెస్తే వారు అధిష్ఠానానికి పేర్ల జాబితాను సమర్పిస్తారని గత కొద్ది రోజులుగా మీడియా నివేదికలలో వెల్లడైంది. ఇందులో ఓ ప్రత్యామ్నాయంగా హోంమంత్రి జి. పరమేశ్వర్ పేరు ఉండవచ్చు. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. సిద్ధరామయ్య వర్గం ఏ పరిస్థితులలోనూ డీకే శివకుమార్‌ను తమ బాస్‌గా అంగీకరించడానికి సిద్ధంగా లేదు. అయితే కొన్ని రోజులకే జేడీఎస్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వం నుంచి బయటకు రావడంతో ప్రభుత్వం కుప్పకూలింది. తాజా పరిస్థితుల్లో కాం గ్రెస్‌లో అలాంటి అవకాశం లేనప్పటికీ హైకమాండ్ సీఎం మార్పుపై ఆచితూచి అడుగులు వేయాల్సిన అవసరముంది.

# విటీ లీక్స్ ట్రంప్ దిగజారుడు!



మరో మూడు నెలలు గడిస్తే ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ఐదవ సంవత్సరంలో ప్రవేశిస్తుంది. అమెరికా,దానితో చేతులు కలిపిన ఇతర నాటో దేశాలు అనుసరిస్తున్న వైఖరి వలన ఉక్రేనియన్లు ఇప్పటికే ఎన్నో ఇబ్బందులు పడ్డారు. రానున్న రోజుల్లో మరింతగా అక్కడి పరిస్థితి దిగజారటం తప్ప మెరుగయ్యే అవకాశాలు కనిపించటం లేదు. అమెరికా ముందుకు తెస్తున్న శాంతి చర్చల అజెండాను ఎవరూ అంగీకరించటం లేదు. ఎందుకంటే ట్రంప్ ఒక వ్యాపారిగా అమెరికా ప్రయోజనాలను చూస్తున్నాడు తప్ప పరిష్కారానికి పని చేయటం లేదు. ఇదిలా ఉండగా ట్రంప్ దూత స్టీవ్ విట్‌కాఫ్ అక్టోబరు 14వ తేదీన రష్యన్ ప్రతినిధులతో జరిపిన సంభాషణను లీక్ చేశారు. ట్రంప్ ఆగ్రహానికి గురైన బ్లూమ్‌బెర్గ్ దాన్ని ప్రచురించింది. ఈ ఉదంతాన్ని "విటీ" లీక్స్‌గా వర్ణిస్తున్నారు. ట్రంప్‌ను వ్యతిరేకించే వారి హస్తం దీని వెనుక ఉందని వేరే చెప్పనవసరం లేదు. ఎవరు అన్నది తేలక ట్రంప్ యంత్రాంగం కాళ్లు తొక్కుకుంటున్నది. చర్చలను వ్యతిరేకించే వారెవరో ఈ పనిచేశారు. సంభాషణ లను ఎవరో వింటున్నారు, ఎవరో బయటపెడుతున్నారు, మేమైతే కాదు అని రష్యా ప్రతినిధులు స్పష్టం చేశారు. సాధారణంగా గూఢచార సంస్థలు ఇలాంటి ఫోన్ కాల్స్‌ను వింటుం టాయి, అవసరాన్నిబట్టి సంభాషణలను లీక్ చేస్తాయి. శాంతి ప్రతిపాదనలపట్ల సుముఖంగా లేని ఉక్రెయిన్ కూడా ఈ పని చేసి ఉండవచ్చని కూడా ఊహాగానాలు సాగుతున్నాయి. గాజా ఒప్పందంగురించి ట్రంప్‌ను పొగడాలని, అలాగే ఉక్రెయిన్ నేత జెలెన్‌స్కీ అమెరికాకు శాంతి ప్రతిపాదనతో వచ్చినపుడు తమ ట్రంప్‌ను పొగడ్తలతో ముంచెత్తేట్లుగా పుతిన్‌కు నచ్చ చెప్పాలని విట్‌కాఫ్ కోరినట్లు దానిలో ఉంది. దాన్లో తప్పే ముంది ఎదుటివారిని ఉబ్బించాలంటే అదొక ఉత్తమశ్రేణి ప్రక్రియ అని ట్రంప్ కుమారుడు సమర్థించాడు. పొగడ్తల కోసం ట్రంప్ ఎంతకైనా దిగజారతాడన్నది ఈ ఉదంతం వెల్లడించింది. బయటకు వచ్చిన సంభాషణ అంశాలపై అధ్యక్ష భవనం మౌనందాల్చింది. ప్రతిపాదనలన్నీ రష్యాకు అనుకూలంగా ఉన్నాయని, విట్‌కాఫ్ నమ్మదగిన వ్యక్తికాదు, చర్చలకు అతగాడు నాయకత్వం వహించటాన్ని అంగీక రించం, రష్యాకు అమ్ముడు పోయిన ఏజెంట్, అతడిని పదవి నుంచి తొలగించా లంటూ రిపబ్లికన్ ఎంపీలు ధ్వజమెత్తారు. అసలే తమను పక్కన పెడుతున్నాడని ట్రంప్ మీద గుర్రుగా ఉన్న ఐరోపా దేశాల్లో ట్రంప్ ప్రతిపాదనలు, తీరు ఆగ్రహాన్ని కలిగించాయి. అవి రష్యాకు లొంగిపోవటం తప్ప వేరు కాదని మండిపడుతున్నాయి. ప్రస్తుతం ఐరోపా దేశాల్లో ఉన్న రష్యా ఆస్తులను స్తంభింప చేశారు. వాటిని అమ్మి ఉక్రెయిన్ పునరుద్ధరణకు ఖర్చు చేయాలన్న ప్రతిపాదన ఉంది. వాటి నుంచి వంద బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తే ఐరోపా దేశాలు మరోవంద బిలియన్ డాలర్లు సమకూర్చాలని, ఈ మొత్తం వ్యవహారాన్ని అమెరికా పర్యవేక్షించాలని, వచ్చే లాభంలో సగం అమెరికాకు చెందేట్లు ప్రతిపాదన ఉంది. రష్యా ఆస్తులను అమెరికా కొట్టేయటం, లాభపడటం తప్ప తమకు ఒరిగేదేముందంటూ ఐరోపా ధనిక దేశాలు గట్టిగా వ్యతిరేకించటంతో 28అంశాల నుంచి తొలగించారని చెబుతున్నారు. ట్రంప్ అల్లుడు జారెడ్ కుషనర్, విట్‌కాఫ్ కలసి రూపొందించిన ఈ అంశాలను 19కి కుదించారు. చర్చల గురించి అమెరికా, ఉక్రెయిన్ ఆశాభావం వెల్లడిస్తున్నప్పటికీ రష్యా వైపు నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేదు. మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న డాన్‌బాస్ ఇతర ప్రాంతాలన్నింటినీ ఉక్రెయిన్ వదులుకోవాల్సి ఉంటుంది. నాటోలో సభ్యత్వం పొందేందుకు అవకాశం లేదు. ఉక్రెయిన్ భద్రతకు అమెరికా హామీగా ఉంటుంది, అయితే అందుకయ్యే ఖర్చును ఉక్రెయిన్ భరించాలి. ఇరుగుపొరుగు దేశాల మీద రష్యా సైనిక చర్యలకు పూనుకోకూడదు. ఉక్రెయిన్ మిలిటరీపై పరిమితి విధించాలి. లక్షకంటే ఎక్కువ ఉండకూడదని రష్యా చెబుతున్నట్లు, ఆరు లక్షలని అమెరికా, కాదు ఎనిమిది లక్షలని ఉక్రెయిన్, ఐరోపా దేశాలు చెబుతున్నట్లు వార్తలు వచ్చాయి. సంప్రదింపుల నుంచి తమను మినహాయిస్తున్నట్లు భావిస్తున్న ఐరోపా ఈ3 దేశాలుగా పిలుస్తున్న బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నాయి. నాటోలో చేరే స్వేచ్ఛఉక్రెయిన్‌కు ఉండాలని చెబుతున్నాయి. ఒప్పందానికి పుతిన్ సిద్ధంగా ఉన్నారా లేదా అన్నది సహజంగానే తలెత్తే ప్రశ్న. మిలిటరీ చర్యను కొనసాగించటం పుతిన్‌కూ ఇబ్బందే కనుక తమకు అనుకూలంగా ఉండే ఒప్పందాన్ని అంగీకరిస్తాడని వేరే చెప్పనవసరం లేదు. రష్యాకు అనుకూల అంశాలను పశ్చిమదేశాలు ఎలాగూ అంగీకరించవు గనుక తానెందుకు ముందుగా బయటపడాలని భావిస్తున్నట్లు కనిపిస్తున్నది. ఉక్రెయిన్ సంక్షోభంలో పూర్తిగా దిగిన రష్యాకు కొత్తగా వేసే చలేమీ లేదు. గౌరవప్రదంగా ఎలా బయట పడాలన్నదే అమెరికా, ఐరోపా ముందున్న సమస్య. వర్తమానంలో ఇలాంటి విపత్కర పరిస్థితిలో సామ్రాజ్యవాద దేశాలు ఏ అంశంలోనూ ఇరుక్కోలేదంటే అతిశయోక్తి కాదు!

# పాలస్తీనా ప్రజలకు మానవ హక్కులు ఉండవా!

29 నవంబర్ 1947 రోజు ఐరాస చేసిన పాలస్తీనా విభజనపై తీర్మానం ఆమోదించిన సందర్భానికి గుర్తుగా ప్రతి ఏట 29 నవంబర్ రోజు ప్రపంచ దేశాలు "పాలస్తీనా ప్రజల పట్ల అంతర్జాతీయ సంఘీభావ దినోత్సవం" పాటించాలని 1978లో సూచించింది. పాలస్తీనా భూభాగంపై చట్టవిరుద్ధమైన ఆక్రమణలను ముగించాలని కోరడంతో పాటు పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలవాలని కోరడం అయినది. గత ఏడు దశాబ్దాలుగా పలు ప్రయత్నాలు జరిగినప్పటికీ మధ్యప్రాచ్యంలో శాశ్వత శాంతి అస్పష్టంగానే ఉన్నదని, తక్షణ పరిష్కారం జరగాలని ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది. పాలస్తీనియన్ల హక్కుల కోసం పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. ఇజ్రాయిల్ దాడులతో గాజాలో నేడు మానవతా సంక్షోభం ఏర్పడింది. 1947లో పాలస్తీనాను యూదు, అరబ్ దేశాలుగా విభజించాలనా ఐరాస ప్రతిపాదించింది. పాలస్తీనా స్వయం నిర్ణయాధికారం, హక్కుల పరిరక్షణ, న్యాయం, గౌరవం కోసం పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. 07 అక్టోబర్ 2023 రోజు హమాస్ దాడులతో ప్రారంభమైన ఇజ్రాయిల్ – పాలస్తీనా యుద్ధం నేడు తీవ్ర రూపం దాల్చి గాజును నేల మట్టం చేయడం, ప్రజలు దీనంగా ప్రాణాలను అరచేతుల్లా పెట్టుకొని వలసలు వెళ్లడం జరుగుతోంది. ఈ యుద్ధంలో దాదాపు 80 శాతం పాలస్తీనియన్ పౌరులు (మహిళలు, పిల్లలతో సహా) మరణించి ఉంటారని అంచనా వేస్తున్నారు. గత 25 మాసాలుగాజరుగుతున్న దాడులతో 72,500లకు పైగా (70,525 పాలస్తీనా పౌరులు, 2,109 ఇజ్రాయిల్ పౌరులు) ప్రజలు ప్రాణాలు కోల్పోవడం జరిగినట్లు స్పష్టం అవుతోంది. చనిపోయిన అభాగ్యుల్లో దాదాపు 33 శాతం మంది 18 ఏండ్ల లోపు వారే ఉండడం విచారకరం. దీనికి తోడుగా దాదాపు 2.3 మిలియన్ల వలసలు కూడా జరిగినట్లు తెలుస్తున్నది. వలసదారుల ఆకలి కేకలు వినే నాధుడే కరువైన దుస్థితి ఏర్పడింది. ఇజ్రాయిలీ బాంబు దాడులకు గాజా గజగజ వణుకుతోంది. శాశ్వత యుద్ధ విరమణ చర్యలు



ముందుకు సాగడం లేదు. 2025 తొలి రోజుల్లో 32,000 మంది పాలస్తీనా ప్రజలను ఇజ్రాయిల్ వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో ఇంట్లోంచి గెంటేసి తిరిగి రాకుండా అడ్డుకట్ట వేయడం ప్రపంచం చూస్తూ నివ్వెరపోయిందే కాని ఏ సంస్థ లేదా దేశం కూడా అడ్డుపడలేదు. ఇజ్రాయిలీ ప్రధాని నేతన్యాహూ దాహానికి సమాధానం లేదు. ఇజ్రాయిలీ బాంబులకు విశ్రాంతి లేదు. పాలస్తీనా ప్రజలకు కంటి మీద కునుకు లేదు. గాజాలో నేల మట్టం కాని భవనాలు లేవు. వలసదారులకు ఆకలి తీర్చే హస్తాలు లేవు. మానవ హక్కుల పరిరక్షణ చర్యలు అసలే లేవు. ఇజ్రాయిల్ రక్త దాహం తీరడం లేదు. ప్రాణాలంటే లెక్కల లేదు. మానవత్వం మరణించింది. రాక్షస దాడులు ఆగడం లేదు. పాలస్తీనా నామరూపాలు లేకుండా పోయింది. శరనార్థులకు చేయూత నిచ్చెన చేతులను సహితం తెగకోసే దారుణాలు జరుగుతున్నాయి. ప్రాణాలున్న పాలస్తీనా ప్రజలు పలుచబడ్డారు. శవాల కుప్పలను చూసిన నాధుడే లేడు. ట్రంప్ మధ్యవర్తిత్వ మాటలకు అర్థాలు వేరుగా కనిపిస్తున్నాయి. కాల్పుల విరమణ వాగ్దానాలు క్షణాల్లో ఆవిరవుతున్నది. ప్రపంచ మానవాళి సంఘీభావంతో పాలస్తీనాకు ఒరిగిందేమీ లేదు. సానుభూతి వరదలు ఏరులై పారినా, పాలస్తీనా ప్రజలకు గుక్కెడు నీళ్లు కూడా అందడం లేదు. నేడు మానవాళి సంఘీభావ శక్తి ఇజ్రాయిల్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి. ఐరాస తన సత్తా చాటాలి. శాశ్వత శాంతి స్థాపనకు ఐరాసతో పాటు అగ్ర రాజ్యాలు కూడా నడుం బిగించాలని కోరుకుందాం.

# రసాయన ఆయుధాలు జీవ వైవిధ్య వినాశనాలు

మొదటి ప్రపంచ యుద్ధంలో విచక్షణారహితంగా వినియోగిం చిన రసాయన ఆయుధాల విధ్వంసం కారణంగా లక్షకు పైగా మరణాలు, మిలియన్ల ప్రజలు గాయపడడం జరిగింది. ఇలాంటి రసాయన ఆయుధాల వినియోగాన్ని పలు దేశాలు వ్యతిరేకించడంతో రెండవ ప్రపంచ యుద్ధంలో అతి పెద్ద ముప్పు తప్పినట్లు అయ్యింది. రసాయన ఆయుధాలు వ్యక్తులను, జీవులను గుర్తించవు. అన్ని జీవజాతులపై రసాయన ఆయుధాల దుష్ప్రభావం పడడం, వాతావరణ కాలుష్యం ఎక్కువ కాలం ప్రభావితం కావడం జరుగుతుంది. 1993లో జరిగిన రసాయన ఆయుధాల సదస్సు జరగడంతో 1997లో ఒక అంగీకారానికి రావడం, మానవాళి మనుగడ కోసం ఏక పక్షంగా రసాయన ఆయుధాల ఉపయోగాన్ని వ్యతిరేకించడం జరిగింది. నాటి నుంచి నేటి వరకు రసాయన ఆయుధాల వాడకాన్ని తగ్గించడం లేదా నిషేధించడం జరగడంతో ప్రస్తుత సంక్షోభాల్లో అపార ప్రాణనష్టం తప్పినట్లు అయ్యింది. రసాయన యుద్ధ బాధితుల జ్ఞాపకార్థ దినం :

రసాయన ఆయుధాల వాడకంతో జరిగిన ప్రాణనష్టంతో పాటు జీవకోటి, పర్యావరణంపై దుష్ప్రభావం జరగడాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏట 29 నవంబర్ రోజు "రసాయన ఆయుధ బాధితుల (లేదా మరణించిన వారి) జ్ఞాపకార్థ దినం (డే ఆఫ్ రిమంబ్రెన్స్ ఫర్ ఆల్ ది విక్టిమ్స్ ఆఫ్ కెమికల్ వార్‌ఫేర్)" పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రపంచ శాంతి, భద్రత, అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు రసాయన ఆయుధాల వినియోగాన్ని నిషేధించడం, వాటి పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది. రసాయన ఆయుధాల దుష్ప్రభావాలను గమనించిన ఐరాస కూడా ఈ దినోత్సవాన్ని గుర్తించడం జరిగింది. రసాయన ఆయుధాల వర్గీకరణ: జీవ వ్యవస్థ పై రసాయన ఆయుధాల ప్రభావాన్ని ఆధారంగా చేసుకొని నర్వ్ ఏజెంట్లు, బ్లిస్టర్ ఏజెంట్లు, ఛోకింగ్ ఏజెంట్లు, బ్లడ్ ఏజెంట్లు లాంటివి ఉన్నాయి. అతి ముఖ్యమైన రసాయన ఆయుధాల్లో సరీన్, సోమన్, తబున్, మస్టర్డ్ గ్యాస్, లివిసైట్, నైట్రోజన్ మస్టర్డ్, ఫాస్‌జీన్, క్లోరిన్, హైడ్రోజన్ సైనైడ్, సయనొజెన్ క్లోరైడ్, అడమ్‌సైడ్ లాంటి అనేక రసాయనాలు వస్తాయి. విచక్షణాజ్ఞానం లేని రసాయన ఆయుధాలు మానవాళి సమూల వినాశనానికి హేతువులుగా మారుతున్న తరుణంలో వాటి వినియోగాన్ని నిషేధించడంతో పాటు పక్కాగా అమలు చేయడం మన కనీస కర్తవ్యం అని తెలుసుకుందాం. సంక్షోభాలకు చోటులేని ప్రపంచాన్ని నిర్మించడంతో పాటు పలు సంక్షోభాల్లో రసాయన ఆయుధాలను వాడటం నేరమని నియమాలు పెడదాం.

# పడి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం ఎన్టిపీసీ కృష్ణనగర్ ప్రాంతంలో ఆదివారం పడి పూజ వేడుక భక్తి శ్రద్ధల నడుమ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు. ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ గ హాజరుకావడంతో కార్యక్రమం మరింత విశిష్టత సంతరించుకుంది. కృష్ణనగర్‌కు చెందిన ఏబీసీ శ్రీనివాస్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ పూజలో ఎమ్మెల్యే గారిని భక్తులు ఘనంగా స్వాగతించారు. కుటుంబ సభ్యులతో సత్సంగం నిర్వహించిన ఎమ్మెల్యే ఇంటి పెద్దలు చిన్నలు అందరికీ ఆశీస్సులు అందిస్తూ, పూజల ద్వారా ప్రాంతానికి శాంతి, సమృద్ధి రావాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ "ప్రజల అభ్యున్నతే నా ధ్యేయం. ఇలాంటి పవిత్ర కార్యక్రమాల్లో పాల్గొనడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. రామగుండం ప్రాంత ప్రజల సంక్షేమం, యువత ఉపాధి, అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయి" అని పేర్కొన్నారు.పూజా కార్యక్రమంలో పాల్గొన్న వేద పండితులు ఎమ్మెల్యేకి ఆశీర్వచనాలు అందించగా, అక్కడి భక్తులు తమ సమస్యలు, అభిప్రాయాలు తెలియజేసే అవకాశం పొందారు. వాటిని శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వేదపండితులు, సంఘ ముఖ్యులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శాంతి, ఐశ్వర్యం కోసం సంప్రదాయంగా నిర్వహించే ఈ పడి పూజ ప్రాంతీయంగా విశేషమైన ఆధ్యాత్మిక వేడుకగా నిలిచింది.



## అజయ్‌ని వరించిన జిల్లాస్థాయి విజయం

**గణపురంప్రధానోపాధ్యాయులకు –డిఈఓ ప్రశంస పత్రము**



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** చిట్యాలలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన2025-26లో ఖిలా ఘనపూర్ జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాల విద్యార్థి అజయ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. ఎమర్జింగ్ టెక్నాలజీ సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యాడు. ఈ విజయానికి మార్గదర్శకత్వం వహించిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బి. శ్రీనివాసులు కృషి విశేషం. విద్యార్థిని ప్రోత్సహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాళిదాసు గారి పాత్రను గుర్తిస్తూ, జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని స్వయంగా ప్రశంస పత్రము అందించారు. పాఠశాల ప్రగతికి, విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి చూపుతున్న కృషిని డిఈఓ ప్రత్యేకంగా అభినందించారు.రాష్ట్రస్థాయిలో కూడా అజయ్ మరింత మెరిసి విజయపతాక ఎగరవేయాలని అధికారులు, ఉపాధ్యాయులు ఆశీర్వదించారు.

## ఏఐటియుసి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ కరీంనగర్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏఐటియ?? ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా మడ్డి ఎల్లా గౌడ్ మాట్లాడుతూ,"సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అవసరమైన వారికి వివిధ ఆరోగ్య భీమా పథకాల కింద కరీంనగర్ వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారు" అని తెలిపారు.శిబిరానికి వంద మందికి పైగా హాజరయ్యారు.డాక్టర్ మైథిలి పాల్గొన్నవారికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో కొంతమందికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించగా, వారిని త్వరలోనే హాస్పిటల్‌కు తరలించి శస్త్రచికిత్సలు చేస్తామని వైద్యులు తెలిపారు.కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ 1 బ్రాంచ్ సహాయ కార్యదర్శి రంగు శ్రీను, ఉపాధ్యక్షులు సంకె అశోక్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ మేనేజర్ యాదగిరి, సిబ్బంది రమేశ్, అజయ్, అన్వేష్, స్నేహ, ఏఐటియుసి ఆర్జీ 1 బ్రాంచ్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మొదటిరోజు ముగిసిన నామినేషన్ల పర్వం



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలవ్యాప్తంగా 2వ విడత ఎన్నికల్లో భాగంగా మొదటిరోజు ఆదివారం వివిధ పార్టీల నుండి 19 మంది సర్పంచ్,13 వార్డ్ మెంబర్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారని ఎన్నికల అధికారులు తెలిపారు.

## నేటి ప్రజావాణి రద్దు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, నవంబర్ 30:** కలెక్టరేట్లో సోమవారం నాడు (01.12.2925) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్ కు రావద్దని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ ఎన్నికలు మాడల్ కోడ్ అమలులో ఉన్నందున అధికారులంతా క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పిల్లలు ఫోన్ లేకుండా ఉండలేకపోతున్నారా..?

ఇప్పటి కాలంలో పిల్లలు మొబైల్ కి బానిసలవ్వడం తల్లిదండ్రులకు పెద్ద సవాలుగా మారింది. ఫోన్ లాక్కోవడం సమస్యకు పరిష్కారం కాదు.. దానికి బదులు కొత్త విషయాలపై ఆసక్తి కలిగించే వాతావరణం సృష్టించాలి. ఆటలు, హాబీలు, పుస్తకాలు, బయట గేమ్స్ ద్వారా పిల్లల్ని మొబైల్‌కి దూరం పెట్టవచ్చు.పిల్లలు మొబైల్‌కు బానిసలు అవ్వకుండా చూడటం ఈరోజుల్లో తల్లిదండ్రులకు ఒక పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యకు పరిష్కారం కేవలం ఫోన్ లాగేసుకోవడం కాదు.. పిల్లలు ఫోన్‌వైపు చూడకుండా ఒక మంచి వాతావరణాన్ని సృష్టించడమే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ఈ డిజిటల్ ప్రపంచంలో ఫోన్ ను పిల్లల జీవితాల నుంచి పూర్తిగా దూరం చేయడం దాదాపు అసాధ్యం.చదువుతో సహా అనేక పనులకు ఇప్పుడు టెక్నాలజీ అవసరం. అంతేకాకుండా ఏదైనా వస్తువును లాగేసుకుంటే అది తమ హక్కు అనే భావన పిల్లల్లో పెరిగి వారు మొండిగా ప్రవర్తించే అవకాశం ఉంది. అందుకే ఇది చేయవద్దు అని చెప్పే బదులు.. దీనికి బదులు ఇది చేయండి అని ప్రోత్సహించడం మంచిది. పిల్లల నుంచి ఫోన్ లాక్కునే బదులు.. వారి జీవితంలో ఉత్సాహం కలిగించే కొత్త విషయాలను పరిచయం చేయాలి.ఆటలు.. బయట ఆడుకోవడం లేదా స్విమ్మింగ్ లాంటివి నేర్పించడం.హాబీలు.. పాటలు, డ్యాన్స్ లేదా ఏదైనా కొత్త కళ నేర్చుకునేలా ప్రోత్సహించడం.పుస్తకాలు.. వారికి ఇష్టమైన కథల పుస్తకాలను కొనివ్వడం. పిల్లలకు ఎలాంటి వాతావరణం ఇస్తున్నామో ఆలోచించడం చాలా ముఖ్యం. సాంకేతికత లేని పాత రోజుల్లో మనం ఎలా ఆడుకున్నామో వారికి చెప్పండి. ఇసుకలో ఆడుకునే అవకాశం, స్విమ్మింగ్ నేర్చుకునే అవకాశం వంటివి వారికి కల్పించండి. అలాంటి వాతావరణం ఉంటే వారికి ఫోన్‌తో పని ఉండదు, వారు దాన్ని అవసరం అని భావించరు.

# ఆర్టీసీ కండక్టర్ మణికుమారి పదవీ విరమణ

**సిపిఐ నాయకుల ఘన సన్మానం**



**అగ్నిధార న్యూస్,( రామగుండం):** గోదావరిఖని ఆర్టీసీ డిపోలో 29 ఏళ్లపాటు కండక్టర్‌గా ప్రజాసేవ అందించిన కాంద్రేగుల మణికుమారి పదవీ విరమణ సందర్భంగా డిపోలో ఆదివారం ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో సిపిఐ నాయకులు మణికుమారి చిన్న సత్యనారాయణ దంపతులకు పూల గుచ్చం అందించి, శాలువా కప్పి ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్ మాట్లాడుతూ "మణికుమారి క్రమశిక్షణ, ప్రజాభిముఖ సేవతో ఉద్యోగులను, ప్రయాణికులను సమానంగా మెప్పించారు. వీరి సేవలు ఆదర్శనీయం" అని పేర్కొన్నారు.సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం, మహిళా సమాఖ్య నాయకురాలు మడికొండ ఓదెమ్మ, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి ఆసాల నవీన్ మాట్లాడి,"ఇక ముందునూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం" అన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ, ఏఐటియుసి కార్యకర్తలు, ఆర్టీసీ ఉద్యోగులు హాజరయ్యారు.

# అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

**డా. బైరి నరేష్ అక్రమ అరెస్టుపై తీవ్ర ఆగ్రహం**

**సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్**



**అగ్ని ధార న్యూస్,,(రామగుండం):** జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఒక పెళ్లి కార్యక్రమానికి హాజరైన డా. బైరి నరేష్ ని అక్రమంగా అరెస్ట్ చేసిన ఘటనపై సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో నరేష్ విశ్రాంతి తీసుకుంటున్న ఇంటికి పోలీసులు చేరుకుని, ఎలాంటి కేసులు వివరించకుండా బలవంతంగా వాహనంలోకి ఎక్కించి స్టేషన్‌కు తీసుకెళ్లడం అమానవీయ చర్యగా ఆయన అన్నారు. అరెస్టు సమయంలో రెండు గంటల పాటు పోలీసు వాహనంలోనే తిరిగిస్తూ, "ఎందుకు అరెస్ట్ చేస్తున్నారు?" అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా అధికారులు వ్యవహరించడం చట్ట వ్యతిరేకమని నగేష్ పేర్కొన్నారు. తన మొబైల్ ద్వారా యూట్యూబ్ లైవ్ పెట్టిన తర్వాత నరేష్ ఫోన్ స్విచ్ ఆఫ్ కావడం, ఇప్పుడు ఆయన ఎక్కడ ఉన్నారో బయటకు తెలియకుండా ఉంచడం పౌర హక్కులపై పెనుముప్పుగా పేర్కొన్నారు. "ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి అక్రమ అరెస్టులు అసహ్యం. వెంటనే ఆయనపై పెట్టిన కేసులు, అరెస్టు కారణాలు, ఆయన ప్రస్తుత స్థానాన్ని పోలీసు అధికారులు ప్రజలకు తెలియజేయాలి. లేదంటే ఇది పూర్తిగా కిడ్నాప్ తరహా చర్యగా పరిగణించాలి," అని మార్షల్ దుర్గం నగేష్ ఘాటుగా హెచ్చరించారు. డా. బైరి నరేష్‌ను వెంటనే విడుదల చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నగేష్ డిమాండ్ చేశారు. అలాగే, ప్రతి ఒక్కరూ ఈ అక్రమ అరెస్టును ఖండించాలని పిలుపునిచ్చారు.

# రామగుండం అభివృద్ధికి రాజ్ ఠాకూర్ కృషి అమోఘం



**మాజీ వైస్ చైర్మన్ రాజుమల్లు గౌడ్ అభినందనలు**

**అగ్ని ధార న్యూస్ (రామగుండం):** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు. ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్‌గ రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా, ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజల హక్కుల కోసం పోరాడే నాయకుడిగా, పేదల-బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గా ఆయన నిలుస్తున్నారని స్థానిక నాయకులు అభినందించారు. రామగుండం యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చేసిన కృషి ఫలితంగా, 1800 మెగావాట్ల పవర్ ప్లాంట్, అలాగే లింగాపూర్ ఓసిపి 4 ద్వారా 500 మెగావాట్ల హైడ్రో ప్లాంట్ కు ప్రభుత్వం ఆమోదం లభించడం ప్రాంత ప్రజల్లో ఆనందం నింపింది.ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్యే ని, రామగుండం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ బొల్లాపల్లి రాజుమల్లు గౌడ్తోపాటు కొక్కిరాల శ్రీనివాసరావు మర్యాదపూర్వ కంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. వీర్లపల్లి ప్రజల తరఫున ఎమ్మెల్యే గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రాంత అభివృద్ధి, పరిశ్రమల విస్తరణ, ఉద్యోగావకాశాల పెరుగుదల కోసం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు అమలు కావాలని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, ఆయన సతీమణి మనాలి ఠాకూర్ రమేష్ నగర్‌ను సందర్శించి ఆదర్శ ఆటో యూనియన్ సభ్యులతో సమావేశమయ్యారు. డ్రైవర్ల సమస్యలు, అవసరాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే కట్టుబడి ఉన్నారని తెలిపారు.ఈ సందర్భంగా పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రాంత ప్రజల శాంతి, అభివృద్ధి కోసం ప్రత్యేక పూజలు చేశారు. డిసెంబర్ 5న ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగే అయ్యప్ప పాడిపూజ కార్యక్రమానికి యూనియన్ సభ్యులకు ఆమె ఆహ్వానం అందించారు. ప్రజలతో మమేకమై సేవలు కొనసాగిస్తామని మనాలి ఠాకూర్ హామీ ఇచ్చారు.

## సంఘవిద్రోహ శక్తులతో పోరాడిన సాహసవంతుడిని సన్మానించిన ఎస్పీ సునీతా రెడ్డి



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పలు స్టేషన్లలో ప్రజా భద్రత, కర్తవ్యనిష్ఠ, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన ఎస్సై-2 జయరాం పదవీ విరమణ సందర్భంగా జిల్లా ఎస్పీ సునితా రెడ్డి ఐపీఎస్ ప్రత్యేకంగా సత్కరించారు. కానిస్టేబుల్‌గా ప్రారంభమైన 36 ఏళ్ల దీర్ఘ సేవా యాత్రను "పోలీసు శాఖకు చిరస్మరణీయ సంపద" పోలీసు ఉద్యోగం అంటే సంఘవిద్రోహ చేతులతో సాహసోపేతంగా పోరాడవలసిన అవసరం ఉంటుందని ఎస్పీ కొనియాడారు.జిల్లా పోలీసు కార్యాలయంలో కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించిన ఈ ఘన వీడ్కోలు కార్యక్రమంలో ఎస్పీ జయరాం కు పూలమాల వేసి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "జయరాం గారి సేవలు కేవలం సంవత్సరాల లెక్క కాదు అవి ప్రజా భద్రతకు, నిజాయితీకి, చట్టపరమైన కర్తవ్యానికి నిలువెత్తు నిదర్శనం. సంఘవిద్రోహ శక్తులతో పోరాటంలో చూపిన ధైర్యం పోలీసు శాఖ గర్వకారణం" అని ఎస్పీ సునితా రెడ్డి ప్రశంసించారు.అసాధారణ సేవలతో ఎదురులేని ప్రయాణం 1989లో కానిస్టేబుల్‌గా సేవ ప్రారంభం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అనేక స్టేషన్లలో కర్తవ్యనిష్ఠతో సేవ ప్రజాసేవాభావం, శిస్తు వల్ల 60 రివార్డులు సేవా గుర్తింపుగా ప్రభుత్వం నుండి 2000లో సేవా పథకం పురస్కారం 2017లో హెడ్ కానిస్టేబుల్, 2020లో ఏఎస్ఐ, 2025లో ఎస్సైగా పదోన్నతులు సంఘవిద్రోహ శక్తులపై చర్యల్లో చురుకైన పాత్ర జిల్లా శాంతి భద్రత కాపాడడంలో కీలక పాత్ర పోలీసు శాఖకు సేవా ముద్ర జయరాం చూపిన నిబద్ధత, సమర్పణ భావం భవిష్యత్ పోలీసు సిబ్బందికి ఆదర్శమని ఎస్పీ అన్నారు. కుటుంబ సభ్యుల సహకారం అభినందనీయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వు ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గూడెంకు ఎన్నికలు లేనట్లే?



**దండేపల్లి :** ఆ ఊరి పేరు గూడెం.. దీనిని గిరిజన గ్రామం అనుకుంటే పొరబడ్డట్లే.. పేరును బట్టి అప్పటి ప్రభుత్వం ఎస్టీకి కేటాయించింది. కానీ ఇక్కడ ఒక్క గిరిజనుడు కూడా లేకపోవడం గమనార్హం. ఎప్పుడు ఎలక్షన్‌లు వచ్చినా దీనిని ఎస్టీకి కేటాయించడం పరిపాటిగా మారింది. గత 38 ఏళ్లుగా ఇక్కడ ఎన్నికలు జరుగడం లేదంటే ఆశ్చర్యానికి గురిచేస్తున్నది.

**1987 నుంచి నిలిచిన ఎన్నికలు**

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో 31 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులోని గూడెం గ్రామ పంచాయతీలో 3468 జనాభా ఉండగా, 2140 మంది ఓటర్లు ఉన్నారు. 10 వార్డులు ఉన్నాయి. ఇందులో 5 జనరల్, 5 ఎస్టీలకు రిజర్వ్ చేశారు. సర్పంచ్ స్థానాన్ని ఎస్టీలకు రిజర్వ్ చేశారు. ఎవరు ఏ ప్రాతిపాదికన జనాభా లెక్కించారో తెలియదు కానీ.. ఇక్కడ ఒక్క గిరిజనుడు లేకపోయినా ప్రభుత్వం ఏజెన్సీ గ్రామంగా గుర్తించింది. 1987 నుంచి ఎస్టీకి కేటాయిస్తూ వస్తున్నారు. కానీ అప్పటి నుంచి ఎన్నికలు జరగడం లేదు. సర్పంచ్ పదవిని ఎస్టీలకు రిజర్వు చేయడంతో అనేకసార్లు గ్రామస్తులు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది.

**బోసిపోతున్న నామినేషన్ కేంద్రం..**

గూడెం జీపీలో నామినేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారితోపాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఇతర అధికారులు నామినేషన్ కేంద్రంలో నామినేషన్ల కోసం వేచి చూస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థి దొరకకపోవడంతో ఇతర జనరల్ వార్డు స్థానాలకు కూడా పోటీ చేయడానికి అభ్యర్థులు ఆసక్తి చూపడం లేదు. దీంతో నామినేషన్ కేంద్రం బోసిపోతున్నది.

## రెండవ దశ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభం



**తాండూర్ :** రెండవ దశ సర్పంచ్ ఎన్నికల కోసం ఆదివారం తాండూర్ మండలంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలో మొత్తం 15 గ్రామపంచాయతీలకు సంబంధించి తాండూర్, అచ్చలాపూర్, మాదారం, కిష్టంపేట గ్రామాలలో 4 కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కిష్టంపేట-1, రాజీవ్ నగర్- 1, బోయపల్లి-1, తాండూర్-1, కొత్తపల్లి 1, నీలాయిపల్లి 2, మాదారం- 1 చొప్పున మొత్తం 8 మంది అభ్యర్థులు సర్పంచ్ స్థానానికి నామినేషన్లు వేశారని, వార్డు సభ్యులకు 10 నామినేషన్లు సమర్పించారని రిటర్నింగ్ అధికారులు తెలిపారు. నామినేషన్ ప్రక్రియను తాండూర్ ఎంపీడీవో పీ శ్రీనివాస్, ఎస్సై కిరణ్ కుమార్, ఎంపీవో అనిల్ కుమార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## అవార్డు గ్రహీత బొల్లి స్వామిని అభినందించిన రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్



**ధర్మారం :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన అంబేద్కర్ సంఘ నాయకుడు బొల్లి స్వామి ఇటీవల అంబేద్కర్ మహాత్మ జ్యోతిబాపూలే జాతీయ స్థాయి అవార్డును పొందగా ఆయనను రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభినందించారు. స్వామి గత 40 సంవత్సరాల నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో స్వామిని జాతీయ ఫౌండేషన్ అంబేద్కర్ పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి పివి రత్నం జాతీయ పురస్కారం కోసం ఎంపిక చేశారు. ఈ క్రమంలో స్వామి చేసిన సేవలను గుర్తించి ఈనెల 26న జరిగిన రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా న్యూఢిల్లీలోని అంబేద్కర్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో స్వామికి అంబేద్కర్ పూలే అవార్డును అందజేశారు. స్వామి మహాత్మ జ్యోతిబాపూలే పురస్కారాన్ని అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం ధర్మారం మండల కేంద్రంలో అవార్డు గ్రహీత స్వామిని లక్ష్మణ్ కుమార్ అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రూప్ల నాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సోగాల తిరుపతి, పట్టణ అధ్యక్షుడు కరేటి వేణు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొత్త నరసింహం, మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశం, ఏఎంసి డైరెక్టర్ జనగామ తిరుపతి, పార్టీ నాయకులు దేవి జనార్ధన్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్‌లో గంజాయితో ఇద్దరు అరెస్టు.. నిందితుల్లో విద్యార్థి



**తిమ్మాపూర్** గంజాయితో పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్ఎండీ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జయ్యారం గ్రామానికి చెందిన కోరండ్ల రఘువర్ధన్‌రెడ్డి అనే యువకుడు లారీ డ్రైవింగ్ చేసుకుంటూ మండల కేంద్రంలోని తిరుమల హోమ్స్ అద్దెకు ఉంటున్నాడు. అలాగే అదే గ్రామానికి చెందిన చింతకింద శ్రీకృష్ణ మండలంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. అయితే వీరు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు హాస్టల్లో ఉంటున్న యువకుడి వద్ద గంజాయి కొనుగోలు చేసి తాగుతుంటారు. వీరు గంజాయితో ఉన్నారనే సమాచారంతో ఎల్ఎండీ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించగా 110గ్రాముల గంజాయి లభ్యమైంది. పోలీసులు వెళ్లినట్లు పసిగట్టిన మరో యువకుడు పారిపోయాడు. వీరి నుండి గంజాయితో పాటూ గంజాయి సేవించే బాంగ్, బైక్ సీజ్ చేశారు. ప్రైవేటు హాస్టళ్లలో ఉంటూ గంజాయికి అలవాటుపడి జీవితాలు పాడుచేసుకోవద్దని ఎస్ఐ శ్రీకాంత్ విద్యార్థులకు సూచించారు. నిత్యం గస్తీ నిర్వహిస్తామని, బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని చెప్పారు. ప్రైవేటు హాస్టళ్ల నిర్వాహకులు సైతం పర్యవేక్షించాలని సూచించారు.

# కట్టుదిట్టంగా ఎన్నికలు నిర్వహించాలి


- సాధారణ ఎన్నికల పరిశీలకులు అనుగు నర్సింహా రెడ్డి
- ఎం.సి.సి ఉల్లంఘనల పట్ల కఠినంగా వ్యవహరించాలి
- ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు
- విధులు నిర్వహించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించాలి
- రెవెన్యూ అధికారులు రెగ్యులర్ గా మానిటర్ చేయాలి
- పంచాయతీ ఎన్నికలపై పరిశీలకులు సమీక్ష





**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, నవంబర్ -30:** పెద్దపల్లి జిల్లాలో పంచాయతీ ఎన్నికలు ఫ్రీ ఫెయిర్ గా నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు అనుగు నర్సింహా రెడ్డి అన్నారు. ఆదివారం సాధారణ ఎన్నికల పరిశీలకులు అనుగు నర్సింహా రెడ్డి పెద్దపల్లి జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి రాం రెడ్డి, అదనపు కలెక్టర్ లు జె.అరుణ , డి.వేణులతో కలిసి పంచాయతీ ఎన్నికల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు అనుగు నర్సింహా రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఎన్నిక మొదటిసారిగా నిర్వహిస్తున్నట్లు భావించి అధికారులు పని చేయాలని అన్నారు. ఎం.సి.సి అమలులో ఎటువంటి నిర్లక్ష్యం వహించడానికి వీలు లేదని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించేలా చూడాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో జరిగే ప్రతి ఖర్చు వివరాలు కట్టుదిట్టంగా అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని అన్నారు. పోలింగ్ , కౌంటింగ్ కేంద్రాలు వేర్వేరు ఉన్న చోట బ్యాలెట్ తరలింపు అప్రమత్తంగా చేయాలని అన్నారు. ప్రతి విడత పోలింగ్ కు రెండు రోజుల ముందు వైన్ షాప్స్ మూసి వేసేలా చూడాలని అన్నారు. తనిఖీ లలో జప్తు చేసే నిధులు నిబంధనలు ప్రకారం చేయాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించాలని, ఎక్కడ చిన్న పొరపాటు కావడానికి ఆస్కారం లేదని, ఫ్రీ అండ్ ఫెయిర్ గా ఎన్నికలు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఎం.సి.సి. నిబంధనల ఉల్లంఘనలు జర్గకుండా చూడాలని, అభ్యర్థులు వినూత్న రీతిలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తారని, దీనిని నిరోధించేందుకు పక్కా నిఘా పెట్టాలని అన్నారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల పరిమితి వివరాలు అందించాలని, నామినేషన్ లో ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీలో ఉండే ప్రతి అభ్యర్థికి ఎన్నికల ప్రచార వ్యయ వివరాల నమోదు చేసేందుకు రిజిస్టర్ లు కేటాయించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎక్కడా కూడా ఎన్నికల ప్రచారంలో భాగస్వామ్యం కావద్దని స్పష్టంగా తెలిపారు. అభ్యర్థుల ఫిర్యాదుల స్వీకరణ కు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, తద్వారా ఎన్నికల పట్ల నమ్మకం పెరుగుతుందని, చిన్న ఫిర్యాదును కూడా నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. ప్రతి ఒక్కరు తమ విధులను పకడ్బందీగా నిర్వహిస్తూ బృందంగా పని చేయాలని, ఎన్నికల పారదర్శకంగా జరగాలని అన్నారు. ఎఫ్.సి.టి , ఎస్.ఎస్.టి ఏర్పాటు పట్ల విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. అనంతరం ఎన్నికల సిబ్బంది శిక్షణ, బ్యాలెట్ పేపర్, ప్రింటింగ్ మేటిరయల్ , బ్యాలెట్ బాక్స్, రవాణా వాహనాలు, గుర్తుల కేటాయింపు మొదలగు వివిధ అంశాలకు సంబంధించిన అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా పరిధిలో మొదటి విడత డిసెంబర్ 11న 99 గ్రామాలు, 896 వార్డులకు రెండవ విడత డిసెంబర్ 14న 73 గ్రామాలు, 684 వార్డులకు , మూడవ విడత డిసెంబర్ 17న 91 గ్రామాలు, 852 వార్డులకు ఎన్నికల జరుగుతాయని అన్నారు. మొదటి విడత జరిగే 99 గ్రామ పంచాయతీలకు 823 నామినేషన్ స్వీకరించామని, రెండవ విడత నోటిఫికేషన్ నేడు విడుదల చేయడం జరిగిందని అన్నారు. నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేస్తున్నామని, ఎన్నికల ప్రచార ఖర్చులను నమోదు చేసేందుకు ధరల లిస్టు సిద్ధం చేశామని అన్నారు. పంచాయతి ఎన్నికలకు సంబంధించి కలెక్టరేట్ లో హెల్ప్ డిస్క్ ఏర్పాటు చేశామని, అది 24 గంటలు పని చేసేలా మూడు షిఫ్టులలో సిబ్బంది నియమించామని అన్నారు.ఎన్నికల సంబంధించి వచ్చే వివిధ ఫిర్యాదులను పరిశీలించే సమస్యలను పరిష్కరించేందుకు వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ర్యాలీలు, సభల నిర్వహణకు తహసిల్దార్, పోలీస్ అధికారులు అనుమతి అందించేలా వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు. నామినేషన్ల ముగిసి అభ్యర్థుల ఫైనల్ అయిన తర్వాత ప్రలోభాలు పెరిగే అవకాశం ఉందని, క్షేత్రస్థాయిలో బృందాలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రచారం ను తహసిల్దార్ , ఆర్డిఓ రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని, కులాలు మతాలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే రికార్డు చేసి నిబంధనలను ప్రకారం వారిని పోటీ నుంచి తొలగించే అవకాశం ఉంటుందని అన్నారు.ఎన్నికల సిబ్బంది కేటాయింపు పోలింగ్ కేంద్రాల వారీగా 3వ ర్యాండమైజేషన్ సాధారణ పరిశీలకుల ఆధ్వర్యంలో చేపట్టాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చాలా తీవ్రంగా ఉంటుందని , ఎక్కడ ఎటువంటి దుర్ఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రౌడీ షీటర్లు, గత ఎన్నికల్లో సమస్యల సృష్టించిన వారిని బైండోవర్ చేయాలని అన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు. కులాలు, మతాల మధ్య ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలు ఉపేక్షించడం జరగదని , బెల్ట్ షాపులను మూసి వేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు బి.గంగయ్య, సురేష్, డీసీపీ. రామ్ రెడ్డి ,ఏసిపి రమేష్, జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, డిపిఓ వీరు బుచ్చయ్య, సంబంధిత అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# స్వాహా చేసి .. పోటీకి దూరమై



**కైలాస్‌నగర్:** గ్రామ పంచాయతీ పాలనలో సర్పంచ్‌లది కీలకపాత్ర. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటా యించే నిధులతో పాటు స్థానికంగా వసూలయ్యే పన్నులను సక్రమంగా వినియోగిస్తూ గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాల్సిన బాధ్యత వారిదే. అయితే జిల్లాలో కొంతమంది సర్పంచ్‌లు అడ్డదారి తొక్కారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. దీంతో డిఫాల్టర్లుగా మిగిలి సర్పంచ్ పదవీకి పోటీకి అనర్హులుగా మిగిలారు. వారి వివరాలను జిల్లా ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించారు. అయితే స్వాహా చేసిన సొమ్ము రికవరీని అధికారులు విస్మరించడం గమనార్హం.

**రూ.1.49 కోట్ల నిధుల దుర్వినియోగం**

జిల్లాలో 1990 నుంచి 2024 వరకు జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవి చేపట్టిన వారి లో 46 మంది నిధులను దుర్వినియోగం చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం వినియోగించాల్సిన రూ.1.49 కోట్ల నిధులను పక్కదారి పట్టించారు. అధికారులు విచారణ జరిపి నిధుల దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారించినా వారు నయాపైసా తిరిగి ప్రభుత్వానికి చెల్లించలేదు. దీంతో డిఫాల్టర్లుగా మిగిలిపోయారు. ఇందులో అత్యధికంగా 2006%-%10 సమయంలో 18మంది, 2013%-%18 సమయంలో నలుగురు నిధులను పక్కదారి పట్టించిన ట్లు తేలింది. ఇందులో అత్యధికంగా జైనథ్ మండలంలో 12మంది, తాంసిలో ఎనిమిది మంది, బో థ్‌లో ఆరుగురు, ఉట్నూర్‌లో నలుగురు, ఇచ్చోడలో ముగ్గురు, ఆదిలాబాద్ రూరల్‌లో నలుగురు, తలమడుగు, గుడిమత్నూర్, బేలలో ఇద్దరేసి చొప్పున, నేరడిగొండ, నార్నూర్, బజార్‌హత్నూర్, ఇంద్రవెల్లిలో ఒక్కొక్కరు చొప్పున నిధులను స్వాహా చేసి డిఫాల్టర్లుగా నిలిచి పోటీకి దూరమయ్యారు.

**తాజా మాజీలు ముగ్గురు..**

తాజా మాజీలుగా మారిన వారిలో ముగ్గురు అనర్హులుగా తేలారు. 2019%-%24 వరకు సర్పంచ్‌గా పనిచేసిన వారిలో ఉట్నూర్ మండలం హస్నాపూర్‌లో అత్యధికంగా రూ.37లక్షల 93వేల 930 నిధుల దు ర్వినియోగం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. అలాగే ఇచ్చోడ మండలం నర్సాపూర్%-%టి సర్పంచ్, ఉపసర్పంచ్ కలిసి రూ.22లక్షల13వేల 831 నిధులను స్వాహాచేశారు. ఉట్నూర్ మండలంలోని శ్యాం నాయక్ తండా సర్పంచ్ రూ.2లక్షల 23వేల157 నిధులు దుర్వినియోగం చేసినట్లుగా తేలింది. వీరు కూడా ప్రస్తుతం పోటీకి అనర్హులుగా మిగిలారు.

**అటకెక్కిన రికవరీ ...**

దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాల్సిన జిల్లా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి న వెంటనే వారితో తమకు సంబంధం లేదనట్లుగా వ్యవహరిస్తున్నారు. మొక్కుబడిగా నోటీసులు జారీ చేసి సరిపెడుతున్నారనే విమర్శలున్నాయి. దీంతో దుర్వినియోగమైన సొమ్ములో ఇప్పటి వరకు నయాపైసా రికవరీ కాకపోవడం గమనార్హం.

**నిధుల రికవరీకి చర్యలు**

పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. స్వాహా చేసిన సొమ్మును తిరిగి చెల్లించాలని తాజా మాజీ సర్పంచ్‌లకు నోటీసులు జారీ చేస్తాం. వాటికి స్పందించని పక్షంలో రెవెన్యూ రికవరీ యాక్ట్ (ఆర్‌ఆర్)ను ఉపయోగించైనా తిరిగి వసూలు చేసేలా చర్యలు చేపడుతాం.

# పంచాయతీ ఎన్నికల్లో సోషల్ మీడియా హవా

**జగిత్యాల:** ఉమ్మడి జిల్లాలో వివిధ కోర్టుల్లో దాదాపు 3,000 మంది న్యాయవాదులు ఉంటారు. ఎప్పుడు కోర్టుల్లో నల్లకోటు వేసుకుని, నాలుగు గోడల మధ్య ఉండే న్యాయవాదులు పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని ప్రజల్లోకి వెళ్లేందుకు ఆరాటపడుతున్నారు. దాదాపు 90 శాతం న్యాయవాదులు గ్రామాల నుంచి వచ్చి ఆయా కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నవారే. ప్రజలతో ఉన్న సంబంధాలతో పాటు రిజర్వేషన్లు కూడా అనుకూలించడంతో పోటీకి సై అంటున్నారు. వివిధ కోర్టుల నుంచి ఐదారుగురు న్యాయవాదులు పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. జగిత్యాల జిల్లాలో పోటీ చేసే న్యాయవాదుల సంఖ్య ఎక్కువగా ఉంది. గత పంచాయతీ ఎన్నికల్లో కొంతమంది న్యాయవాదులు సర్పంచ్‌లుగా గెలుపొందగా, ఇప్పుడు వారిని చూసి మరికొందరు పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఆయా సామాజిక వర్గాల్లో పెద్దగా చదువుకున్న వారు లేకపోవడం, ఏదైనా సమస్య వస్తే గట్టిగా మాట్లాడేవారు కరువవడంతో న్యాయవాదులుగా ఉన్నవారిని పోటీ చేయాలని కులసంఘాలే డిమాండ్ చేస్తూ గ్రామాలకు పిలుస్తున్నాయి.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు సోషల్ మీడియా ప్రచారాన్ని విస్తృతంగా వాడుకుంటున్నారు. వివిధ రకాల యాప్‌లు అందుబాటులోకి రావడంతో తమకు ఉన్న పరిజ్ఞానంతో ఫొటోలు, వీడియోలతో ఎన్నికల పాటలు చిత్రీకరించి, ఓటర్లకు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ పాటలన్నీ కూడా యువతను ఉత్తేజపరిచేలా, మహిళలను గౌరవించే విధంగా, గ్రామాభివృద్ధికి పాటుపడేలా, పోటీ చేస్తున్న నాయకుడిని పొగిడేలా.. ఇప్పటికే ట్రెండ్‌లో ఉన్న రాజకీయ, సినిమా, జానపద పాటలను వాడుకుంటున్నారు. ఇందుకోసం, గ్రామంలో కులాల వారీగా, యువజన సంఘాల వారీగా, మహిళల గ్రూపుల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి పోస్ట్ చేస్తూ ప్రచారం చేసుకుంటున్నారు. తాము గెలిస్తే గ్రామాభివృద్ధికి చేయబోయే పనులను కూడా ఆ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. ఇది చాలదన్నట్టూ తమ బంధువులు, అనుయాయుల సెల్‌ఫోన్లలో స్టేటస్‌లుగాను, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్‌ల్లో సైతం పోస్టులు పెడుతున్నారు. కొందరు అభ్యర్థులు తమ ఫొటోలతో డిజైన్ చేయించి, గ్రూపుల్లో పెడుతూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు. వాయిస్ మేసేజ్‌లను కూడా జత చేస్తున్నారు.

సర్పంచ్ ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొంత మంది ఎలాగైనా బరిలో ఉండాలని ఉద్దేశంతో ముందు నుంచే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

అగ్నిధార
http://www.agnidharanews.com
నిజాల నిప్పు కణిక

# బిజినెస్

## ఎఫ్ఎస్‌టీసీలో అదానీ గ్రూప్‌నకు వాటాలు




డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా పైలట్లకు శిక్షణ విభాగంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకు సంబంధించి ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్ఎస్‌టీసీ)లో 72.8 శాతం వాటాలు కొనుగోలు చేస్తోంది. అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ (ఏడీఎస్‌టీఎల్), దానికి 50 శాతం వాటాలున్న హెరైజన్ ఏరో సొల్యూషన్స్ (హెచ్ఏఎస్ఎల్) సుమారు రూ. 820 కోట్లు వెచ్చించనున్నాయి. ఎఫ్ఎస్‌టీసీకి హైదరాబాద్‌తో పాటు గురుగ్రామ్‌లో సిమ్యులేషన్ సెంటర్లు ఉన్నాయి. హర్యానాలోని భివాని, నార్నౌల్‌లో ఫ్లయింగ్ స్కూల్స్ నిర్వహిస్తోంది. సంస్థ 11 అధునాతన ఫుల్ ఫ్లయిట్ సిమ్యులేటర్లు, 17 ట్రైనింగ్ విమానాలు ఉన్నాయి. కమర్షియల్ పైలట్ లైసెన్సులకు శిక్షణ, ప్రత్యేక నైపుణ్యాల కోర్సులను అందిస్తోంది.

## జియో ఖాతాలో మరో 20 లక్షల మంది


**దిల్లీ:** ఈ ఏడాది అక్టోబరులో రిలయన్స్ జియో కొత్తగా 19.97 లక్షల మంది మొబైల్ ఖాతాదారులను చేర్చుకుంది. దీంతో సంస్థ మొత్తం చందాదారుల సంఖ్య 48.47 కోట్లకు చేరినట్లు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ గణాంకాలు స్పష్టం చేశాయి. ఇదే నెలలో ఎయిర్‌టెల్ వినియోగదారులు 12.52 లక్షలు పెరిగి 39.36 కోట్లకు చేరారు. బీఎస్ఎన్ఎల్ కూడా 2.69 లక్షల ఖాతాదారులను చేర్చుకుని, మొత్తం సంఖ్యను 9.25 కోట్లకు పెంచుకుంది. వొడాఫోన్ ఐడియా మాత్రం 20.83 లక్షల మంది ఖాతాదారులను పోగొట్టుకోవడంతో మొత్తం సంఖ్య 20.07 కోట్లకు పరిమితమైంది. మన దేశ మొత్తం టెలిఫోన్ చందాదారుల సంఖ్య 123 కోట్లకు పెరిగింది. ఇందులో వైర్‌లెస్ 118.4 కోట్లు కాగా.. వైర్‌లైన్ చందాదారులు 4.6 కోట్లు.

## పసిడి ధరను నిర్దేశించే స్థాయికి భారత్

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా పసిడి ధరను నిర్దేశించే స్థాయికి భారత్ త్వరలో ఎదుగుతుందని పరిశ్రమ వర్గాలు ధీమా వ్యక్తం చేశాయి. రాబోయే దశాబ్దకాలంలో భారత పసిడి డిమాండ్‌లో 20 శాతం అవసరాలు దేశీయంగా బంగారం మైనింగ్ ద్వారా తీరుతుందని పేర్కొన్నాయి. 2047 నాటికి వికసిత్ భారత లక్ష్యం దిశగా దేశం ముందుకెళ్తున్న నేపథ్యంలో మైనింగ్ చాలా కీలకంగా ఉంటుందని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిర్వహించిన రత్నాభరణాల సదస్సులో పాల్గొన్న సందర్భంగా వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ రీజనల్ సీఈవో సచిన్ జైన్ చెప్పారు. పసిడి మైనింగ్‌లో ఉద్యోగాలు, విదేశీ పెట్టుబడులు గణనీయంగా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. దేశీయంగా ప్రస్తుతం చెప్పుకోతగ్గ స్థాయిలో మైనింగ్, గోల్డ్ బ్యాంకింగ్ లేకపోవడం వల్ల వేరే వారు నిర్ణయించిన ధరను భారత్ పాటించాల్సి వస్తోందని, లండన్ ఏఎం, పీఎం బెంచ్‌మార్క్ ధరలపై ఆధారపడాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆర్‌బీఐతో పాటు బ్యాంకింగ్ వ్యవస్థ కూడా పరివర్తన చెందే కొద్దీ ధరలపై కూడా మనం ప్రభావం చూపగలిగే అవకాశం ఉంటుందని జైన్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే రెండు మూడేళ్లలో భారత్ అంతర్జాతీయంగా కీలకమైన జ్యుయలరీ హబ్‌గా ఎదుగుతుందని చెప్పారు.

# ఎగుమతులకు టారిఫ్ సెగ

**న్యూఢిల్లీ :** దేశీయ ఎగుమతులకు టారిఫ్ సెగ గట్టిగానే తగిలింది. దేశీయ ఉత్పత్తులపై అగ్రరాజ్యం అమెరికా ప్రతీకార సుంకాలను విధించడంతో ఎగుమతులు భారీగా కుంగాయి. ఈ ఏడాది మే నెల నుంచి అక్టోబర్ చివరినాటికి ఎగుమతులు 28 శాతానికి పైగా పడిపోయాయి. దేశీయ ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలను 50 శాతానికి పెంచుతూ అమెరికా తీసుకున్న నిర్ణయంతో ఎగుమతులు 6.31 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. క్రితం ఏడాది ఇదే నెలలో ఎగుమతైన 8.83 శాతంతో పోలిస్తే 28.5 శాతం తగ్గాయని గ్లోబల్ ట్రేడ్ రీసర్చ్ ఇనిషియేటివ్(జీటీఆర్) ఆందోళనను వ్యక్తంచేసింది. దేశీయ ఎగుమతుల్లో అత్యధికంగా అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై ప్రతీకార సుంకాలను విధించడం వల్లనే ఎగుమతులు తగ్గుముఖం పట్టాయని జీటీఆర్ఐ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది ఏప్రిల్ 2న పది శాతంగా ఉన్న టారిఫ్..ఆగస్టు 7 నాటికి సుంకాలను 25 శాతానికి పెంచింది. అలాగే అదే నెల చివరి నాటికి టారిఫ్‌ను రెండింతలు పెంచి 50 శాతానికి సవరించింది. అప్పటి నుంచి ఇదే టారిఫ్ అమలులో ఉన్నది. రష్యా చమురును కొనుగోలు చేసినందుకుగాను ట్రంప్ భారత్‌పై కక్ష కట్టి టారిఫ్‌ను అమాంతం పెంచారు. దీంతో దేశీయ తయారీదారులు అమెరికాను ఎగుమతులు తగ్గించి, ఇతర దేశాల్లో తమ ఉత్పత్తులకు డిమాండ్ పెంచడానికి ఆసక్తి చూపుతున్నారు. టారిఫ్‌ల విధింపుపై భారత్-అమెరికా దేశాల మధ్యజరుగుతున్న చర్చలు ఇప్పటికీ కొలిక్కిరాలేదు. త్వరలో శుభవార్త వింటారని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యానించినప్పటికీ చర్చల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. అమెరికా ప్రభుత్వ ఉన్నతాధికారులు భారత్‌లో పర్యటించి దేశీయ అధికారులతో చర్చలు జరిపినప్పటికీ తుది నిర్ణయం తీసుకోవడంలో మాత్రం జాప్యం జరుగుతున్నది. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా అమెరికా వెళ్లి అక్కడి అధికారులతో చర్చలు జరిపారు. వీరి ప్రతిపాదనలపై ఆయా ప్రభుత్వాలు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలుస్తున్నది. భారత్‌పై అత్యధిక టారిఫ్‌లను




విధించిన అమెరికా.. చైనా, జపాన్ దేశాలపై మాత్రం కరుణ చూపించింది. చైనాపై 150 శాతం పన్ను విధించిన యూఎస్ ఆ తర్వాతి క్రమంలో దీనిని 30 శాతానికి కుదించింది. అలాగే జపాన్‌పై 15 శాతం టారిఫ్‌ను వసూలు చేస్తున్నది.

### ఫార్మా, స్మార్ట్‌ఫోన్లు డౌన్

అమెరికాకు ఎగుమతయ్యే వాటిలో అత్యధికంగా ఉన్న ఫార్మాస్యూటికల్స్, స్మార్ట్‌ఫోన్లు, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు భారీగా నీరసించాయి. అక్టోబర్ నెల ఎగుమతుల్లో 40.3 శాతంగావున్న వీటి వాటా 25.8 శాతానికి పడిపోయింది. మే నెలలో 3.42 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు జరగగా, అక్టోబర్ నెలకు 2.54 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతర్జాతీయ దేశాల మధ్య టారిఫ్ యుద్ధం తెరపైకి రావడంతో ఇనుప ఖనిజం, స్టీల్, అల్యుమినియం, రాగి, వాహన విడిభాగాల వాటా 7.6 శాతానికి పడిపోయింది. ఈ విభాగ ఎగుమతులు 23.8 శాతం తగ్గి 629 మిలియన్ డాలర్ల నుంచి 480 మిలియన్ డాలర్లకు పడిపోయాయి. వీటితోపాటు జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ, సోలార్ ప్యానెల్, టెక్స్‌టైల్స్, గార్మెంట్, కెమికల్స్, సముద్రపు ఉత్పత్తుల ఎక్స్‌పోర్ట్స్ కూడా 52.1 శాతం నుంచి 31.2 శాతానికి జారుకున్నాయి. విలువ పరంగా చూస్తే 4.78 బిలియన్ డాలర్ల నుంచి 3.28 బిలియన్ డాలర్లకు తగ్గినట్టు జీఆర్‌టీఐ వెల్లడించింది. ఎగుమతుల వృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహక చర్యలు తీసుకోవాలని జీటీఆర్ఐ సూచిస్తున్నది. మే నెల నుంచి అక్టోబర్ వరకు దేశీయ స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 36 శాతం తగ్గాయి. వీటి విలువ 2.29 బిలియన్ డాలర్ల నుంచి 1.50 డాలర్లకు చేరుకున్నాయి. నెలవారీగా జూన్‌లో 2 బిలియన్ డాలర్లు కాగా, జూలై 1.53 బిలియన్ డాలర్లకు, ఆగస్టులో 964.8 మిలియన్ డాలర్లకు, సెప్టెంబర్ నెలలో 884.6 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కానీ, అక్టోబర్ నెలలో మాత్రం తిరిగి కోలుకుని 1.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఔషధాల ఎగుమతులు 1.6 శాతం తగ్గుముఖం పట్టగా.. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 15.5 శాతం పతనం చెందాయి.

# రోజూ రెండు కొత్త ఫార్మసీ స్టోర్లు

## అయిదేళ్లలో 10 కోట్ల మంది వినియోగదార్ల లక్ష్యం

అపోలో హెల్త్‌కో ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్ శోభన కామినేని అపోలో హాస్పిటల్స్ గ్రూపు సంస్థ అయిన అపోలో ఫార్మసీ విస్తరణ బాటలో ఉంది. రోజూ 2 కొత్త ఫార్మసీ స్టోర్లు ప్రారంభించాలని, అయిదేళ్లలో 10 కోట్ల మంది వినియోగదార్లను సంపాదించుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. తాజాగా ఈ సంస్థ 7,000 ఫార్మసీ స్టోర్ల సంఖ్యను చేరుకుంది. 7,000వ స్టోర్‌ను ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ప్రారంభించారు. రోజూ తమకు 10 లక్షలకు పైగా మందుల ఆర్డర్లు లభిస్తున్నాయని అపోలో హెల్త్‌కో ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్ శోభన కామినేని తెలిపారు. అపోలో ఫార్మసీ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అయిన అపోలో 24/7 యాప్, దేశంలోని 19,000 పిన్‌కోడ్‌లకు మందులు పంపిణీ చేస్తోందని అన్నారు. అపోలో వైద్యులతో ఆన్‌లైన్ కన్సల్టేషన్, డయాగ్నొస్టిక్, ఆరోగ్య బీమా సేవలనూ అందిస్తున్నట్లు వివరించారు.ఫీజుతో లభించే ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం 'అపోలో సర్కిల్' సభ్యుల సంఖ్య కోటికి చేరుకుందని అపోలో ఫార్మసీ సీఈఓ పి.జయకుమార్ అన్నారు.



## దంచికొట్టిన కోహ్లి, రోహిత్, రాహుల్..

# సౌతాఫ్రికాకు భారీ లక్ష్యం

సౌతాఫ్రికాతో తొలి వన్డేలో భారత్ భారీ స్కోరు సాధించింది. రాంచి వేదికగా నిర్ణీత యాభై ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. తద్వారా సౌతాఫ్రికాతో వన్డేల్లో రెండో అత్యధిక స్కోరును భారత్ నమోదు చేసింది.

**రోహిత్ మెరుపు అర్ధ శతకం**

స్వదేశంలో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రాంచి వేదికగా సౌతాఫ్రికాతో తొలి వన్డే లో టాస్ ఓడిన టీమిండియా.. తొలుత బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లలో యశస్వి జైస్వాల్ (18) నిరాశపరచగా.. రోహిత్ శర్మ ధనాధన్ దంచికొట్టాడు. మెరుపు అర్ధ శతకం (51 బంతుల్లో 57) సాధించాడు. మరోవైపు.. రోహిత్‌తో కలిసి వన్‌డౌన్ బ్యాటర్ విరాట్ కోహ్లి కూడా ఆకాశమే హద్దుగా చెలరేగాడు. హిట్‌మ్యాన్‌తో కలిసి రెండో వికెట్‌కు 136 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పాడు.

**కోహ్లి రికార్డు సెంచరీ**

ఈ క్రమంలో 102 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్న కోహ్లి.. ఆ తర్వాత జోరు పెంచాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్ (56 బంతుల్లో 60)తో కలిసి ఐదో వికెట్‌కు 76 పరుగులు జోడించిన కోహ్లి.. నండ్రీ బర్గర్ బౌలింగ్‌లో రికెల్టన్‌కు క్యాచ్




ఇచ్చి అవుటయ్యాడు. ఈ మ్యాచ్‌లో మొత్తంగా 120 బంతులు ఎదుర్కొన్న కోహ్లి 11 ఫోర్లు, ఏడు సిక్సర్ల సాయంతో 135 పరుగులు సాధించాడు. తద్వారా అంతర్జాతీయ కెరీర్‌లో ఓవరాల్‌గా 83వ శతకం, వన్డేల్లో 52వ సెంచరీ నమోదు చేశాడు.

**రాణించిన జడేజా**

మిగిలిన వారిలో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (20 బంతుల్లో 32) వేగంగా ఆడగా.. రుతురాజ్ గైక్వాడ్ (8), వాషింగ్టన్ సుందర్ (13) విఫలమయ్యారు. ఈ క్రమంలో నిర్ణీత యాభై ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి భారత్ 349 పరుగులు సాధించి.. సౌతాఫ్రికాకు 350 పరుగుల టార్గెట్ విధించింది. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్, నండ్రీ బర్గర్, కార్బిన్ బాష్, ఒట్నీల్ బార్ట్‌మన్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. కాగా వన్డేల్లో టీమిండియాకు ఇది రెండో అత్యధిక స్కోరు (349/8). ఇంతకు ముందు 2010లో గ్వాలియర్ వేదికగా టీమిండియా ప్రొటీస్ జట్టుపై మూడు వికెట్ల నష్టానికి 401 పరుగులు (401/3) చేసింది. ఇదిలా ఉంటే.. శుబ్‌మన్ గిల్ మెడ నొప్పి వల్ల వన్డే సిరీస్‌కు దూరం కాగా.. కేఎల్ రాహుల్ టీమిండియాను ముందుకు నడిపిస్తున్నాడు.

## శతక్కొట్టిన అభిషేక్ శర్మ.. సిక్సర్ల వర్షం.. సరికొత్త చరిత్ర

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ-2025 మ్యాచ్‌లో టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ అదరగొట్టాడు. బెంగాల్‌తో ఆదివారం నాటి మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ పంజాబ్ కెప్టెన్.. భారీ శతకం బాదాడు. కేవలం 32 బంతుల్లోనే వంద పరుగులు మార్కు అందుకున్నాడు. దేశవాళీ టీ20 క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ-2025లో భాగంగా ఎలైట్ గ్రూప్-'సి'లో పంజాబ్- బెంగాల్ తలపడ్డాయి. హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో ఓపెనర్లు కెప్టెన్ అభిషేక్ శర్మ వికెట్ కీపర్ బ్యాటర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఆది నుంచే బెంగాల్ బౌలర్లపై దాడికి దిగారు. ఆకాశమే హద్దుగా బౌండరీల వర్షం కురిపిస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలో అభిషేక్ శర్మ 32 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా 52 బంతులు ఎదుర్కొని ఎనిమిది ఫోర్లు, 16 సిక్సర్ల సాయంతో 148 పరుగులు సాధించాడు. అయితే, ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో వ్రితిక్ ఛటర్జీకి క్యాచ్ ఇవ్వడంతో అభిషేక్ సునామీ ఇన్నింగ్స్?కు తెరపడింది. మరోవైపు.. ప్రభ్‌సిమ్రన్ సింగ్ 35 బంతుల్లోనే 70 పరుగుల సాధించాడు. అతడి ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లతో పాటు 4 సిక్స్‌లు ఉన్నాయి. మిగతా వారిలో రమణ్‌దీప్ సింగ్ (15 బంతుల్లో 39), సన్వీర్ సింగ్ (8 బంతుల్లో 22) మెరుపు ఇన్నింగ్స్ ఆడగా.. అన్మోల్‌ప్రీత్ సింగ్ (6 బంతుల్లో 11) కాస్త నిరాశపరిచాడు. ఇక నమన్ ధిర్ (2 బంతుల్లో 7), నేహాల్ వధేరా (2 బంతుల్లో 2) ఆఖరి వరకు అజేయంగా నిలిచారు. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో కేవలం



ఐదు వికెట్లు నష్టపోయిన పంజాబ్ ఏకంగా 301 పరుగులు సాధించింది. బెంగాల్ బౌలర్లలో ఆకాశ్ దీప్ రెండు వికెట్లు తీయగా.. మొహమ్మద్ షమీ, షక్షైమ్ చౌదరి, ప్రదీప్త ప్రామాణిక్ తలా ఒక వికెట్ పడగొట్టారు. ఈ క్రమంలో భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగాల్ 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు నష్టపోయి కేవలం 198 పరుగులే చేసింది. పంజాబ్ బౌలర్ల ధాటికి బెంగాల్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టగా.. అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఒంటరి పోరాటం చేశాడు. కేవలం 66 బంతుల్లోనే 12 ఫోర్లు, 8 సిక్స్‌లు బాది 130 పరుగులతో అజేయంగా నిలిచాడు. అభిమన్యుకు తోడుగా.. పేసర్ ఆకాశ్ దీప్ (7 బంతుల్లో 31) ఒక్కడే మెరుపు వేగంతో పరుగులు రాబట్టాడు. అయితే, మిగతా వాళ్లంతా చేతులెత్తేయడంతో పంజాబ్ చేతిలో బెంగాల్ ఏకంగా 112 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ నాలుగు వికెట్లతో చెలరేగగా.. నేహాల్ వధేరా, గుర్నూర్ బ్రార్ చెరో రెండు.. అభిషేక్ శర్మ ఒక వికెట్ దక్కించుకున్నారు. భారీ సెంచరీతో కదం తొక్కి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన అభిషేక్ శర్మకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.


# స్పోర్ట్స్

## ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఆండ్రీ రస్సెల్.. ఇకపై కొత్త పాత్రలో కనిపించనున్న స్టార్ ఆల్‌రౌండర్!



ఇండియన్ ప్రీమియర్ లీగ్-2026 ప్లేయర్స్ మినీ వేలానికి ముందు లెజెండరీ వెస్టిండీస్ ఆల్ రౌండర్ ఆండ్రీ రస్సెల్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఐపీఎల్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించారు. ఇటీవల కోల్‌కతా నైట్‌రైడర్స్ రస్సెల్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, మినీ వేలంలో రసెల్‌కు భారీ ధర వస్తుందని అంతా భావించారు. కానీ, స్టార్ ఆల్‌రౌండర్ టోర్నీకి వీడ్కోలు పలుకుతున్నట్లు తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్ కోసం మినీ వేలం డిసెంబర్ 16న అబుదాబిలో జరుగనున్నది. 2014 నుంచి కేకేఆర్ ఫ్రాంచైజీలో ఉన్న రస్సెల్ త్వరలో కొత్త పాత్రలో కనిపించనున్నాడు. ఇకపై కేకేఆర్ కోచింగ్ స్టాఫ్‌లో భాగం కానున్నాడు. పవర్ కోచ్‌గా కేకేఆర్ నియమించింది. 'తాను ఐపీఎల్ నుంచి రిటైర్ అవుతున్నాను. ఐపీఎల్ ఒక అద్భుతమైన ప్రయాణం. 12 సంవత్సరాల జ్ఞాపకాలు. కేకేఆర్ ఫ్యామిలీ నుంచి చాలా ప్రేమ ఉంది. నేను ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర లీగ్‌లలో సిక్సర్లు కొట్టడం, వికెట్లు తీయడాన్ని కొనసాగిస్తాను. ముఖ్యమైన విషయం ఏంటంటే.. నేను కేకేఆర్‌ను వదిలి వెళ్లడం లేదు. మీరు నన్ను కొత్త పాత్రలో చూస్తారు. 2026లో కేకేఆర్ సపోర్ట్ స్టాఫ్‌లో పవర్ కోచ్‌గా పని చేస్తాను. కొత్త అధ్యాయం. కానీ, అదే శక్తి, ఎల్లప్పుడూ నైట్ రైడర్స్‌లో భాగం' అని పేర్కొన్నాడు. కరేబియన్‌కు చెందిన మరో లెజెండరీ టీ20 క్రికెటర్ కీరన్ పొలార్డ్ అడుగుజాడల్లో నడుస్తున్నాడు. పొలార్డ్ ముంబయి ఇండియన్స్‌కు బ్యాటింగ్ కోచ్‌గా పని చేస్తున్నాడు. గతంలో ముంబయి జట్టు తరఫున చాలాకాలం ప్రాతినిథ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. 37 సంవత్సరాల రస్సెల్ 11 సంవత్సరాల పాటు కేకేఆర్ తరఫున ప్రాతినిథ్యం వహించారు. 2014లో ఫ్రాంచైజీలో చేరాడు, జట్టులో కీలక ఆటగాళ్లలో రస్సెల్ ఒకడు. రస్సెల్ కేకేఆర్ తరఫున 133 మ్యాచులు ఆడాడు. 2014, 2024లో కేకేఆర్ టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. గత సీజన్‌కు ముందు మెగా వేలానికి ముందు రస్సెల్‌ను రూ.12 కోట్లకు కేకేఆర్ నిలుపుకుంది. గత సీజన్‌లో ప్రదర్శన ఆకట్టుకోలేక పోవడంతో కేకేఆర్ అతన్ని విడుదల చేయాలని నిర్ణయించింది. 2025 సీజన్‌లో 13 ఇన్నింగ్స్‌లో 167 పరుగులు చేసి, ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ రస్సెల్ 140 మ్యాచుల్లో 174.18 రేట్ 2,651 పరుగులు చేయగా.. 123 వికెట్లు పడగొట్టాడు.

# ఆంధ్ర కింగ్ తాలూకా.. మూడు రోజుల్లో ఎన్ని కోట్లంటే?




టాలీవుడ్ హీరో రామ్ పోతినేని నటించిన లేటేస్ట్ మూవీ ఆంధ్ర కింగ్ తాలూకా. అభిమానుల భారీ ఆశలు పెట్టుకున్న ఈ సినిమా నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో రిలీజైంది. మొదటి రోజే మిక్స్‌డ్ టాక్ రావడంతో వసూళ్ల పరంగా నిరాశపర్చింది. తొలి రోజు కేవలం రూ.4 కోట్లకు పైగా కలెక్షన్స్ మాత్రమే రాబట్టింది. ఇక వీకెండ్ కలిసి రావడంతో వసూళ్లు కాస్తా పెరిగినట్లు తెలుస్తోంది. ఈ మూవీ రిలీజైన మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.16.5 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది. మూడో రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.5 కోట్లకు పైగా కలెక్షన్స్ సాధించింది. నెట్ వసూళ్ల పరంగా చూస్తే రూ.10 కోట్ల మార్క్‌ను దాటేసింది.

అయితే మేకర్స్ అంచనాలకు తగ్గట్టుగా వసూళ్ల రాబట్టడంలో ఆంధ్ర కింగ్ సక్సెస్ కాలేకపోయాడు. ఈ మూవీ బ్రేక్ ఈవెన్ సాధించాలంటే ఇప్పటికే 50 కోట్ల గ్రాస్ వసూలు చేయాలి. కానీ మూడు రోజులైనా ఆ మార్క్ దరిదాపుల్లోకి కూడా వచ్చేలా కనిపించడం లేదు. దీంతో ఈ మూవీ వసూళ్లపై మేకర్స్ ఆందోళన చెందుతున్నారు. కాగా.. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా కనిపించగా.. ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో తెరకెక్కించారు.



# 'ది రాజా సాబ్' పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యం ప్రభాస్ అభిమానుల్లో ఆందోళన!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టుల్లో నటిస్తూ తన మార్కెట్‌ను మరింత పెంచుకుంటున్నారు. అదే సమయంలో ప్రేక్షకులు అతని ప్రతి సినిమా కోసం అపారమైన ఆసక్తితో ఎదురు చూస్తారు. ప్రభాస్ క్రేజీ ప్రాజెక్ట్‌లో ఒకటైన 'ది రాజా సాబ్' త్వరలో విడుదల కావాల్సి ఉంది. రొమాంటిక్, హారర్, కామెడీ కలిసిన యూనిక్ జానర్‌లో దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం మొదటి నుంచే సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చనీయాంశమైంది. ముఖ్యంగా ప్రభాస్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించబోతున్నారని సమాచారం రావడంతో ఈ సినిమా పైన హైప్ ఇంకా పెరిగింది. మొదట ఈ సినిమా డిసెంబర్ 5, 2025న రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. కానీ తర్వాత విడుదల తేదీని సంక్రాంతి 2026 జనవరి 9కు మార్చారు. అయితే ఈ తేదీ కూడా ఖరారు కాలేదని ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారమవుతోంది. ఈ అనుమానాల నడుమ మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేసి "సంక్రాంతికే వస్తున్నాం" అని క్లారిటీ ఇచ్చారు. అయినప్పటికీ ఇండస్ట్రీలో మాత్రం సరికొత్త మాటలు వినిపిస్తున్నాయి. ఇండస్ట్రీలో వినిపించే టాక్ ప్రకారం థియేట్రికల్, ఓటీటీ, సాటిలైట్ రైట్స్ వంటి కీలక డీల్స్ ఇంకా ఫైనల్ కాలేదట. ప్రభాస్ సినిమాలపై సాధారణంగా భారీ క్రేజ్ ఉండే నేపథ్యంలో ఇది కొంచెం ఆశ్చర్యకరంగా ఉంది. డిస్ట్రిబ్యూటర్లు రిస్క్ తీసుకోవడానికి మొహమాటపడుతున్నా రని, సినిమా బజ్ ఆశించిన స్థాయిలో లేదని, కావలసిన రేంజ్‌లో ఆఫర్లు రాలేదని సమాచారం ప్రభాస్ నటించే 'స్పిరిట్' సినిమాకు ఇప్పటికే ?160 కోట్ల భారీ ఓటీటీ డీల్ కుదిరినట్లు వార్తలు వచ్చాయి. అయితే 'రాజా సాబ్' విషయంలో ఇంకా ఓటీటీ ఒప్పందం జరగకపోవడం చర్చనీయాంశమైంది. ఈ సినిమాకు విపరీతంగా %ఎఖీశ% ఉండటం వల్ల పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఆలస్యమవుతున్నాయట. గ్రాఫిక్స్ వర్క్ పూర్తికాకపోవడం కూడా విడుదల తేదీపై ప్రభావం చూపుతోంది. ఇటీవల విడుదలైన ఫస్ట్ సింగిల్ మంచి స్పందన తెచ్చుకున్నప్పటికీ, సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేయలేకపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనితో సినిమా నిజంగా సంక్రాంతికే వస్తుందా? లేక వాయిదా పడుతుందా? అనే సందేహాలు అభిమానుల్లో కనిపిస్తున్నాయి.



# ఓటీటీలోకి రష్మిక మందన్నా 'ది గర్ల్ ఫ్రెండ్'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటించిన సూపర్ హిట్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ 'ది గర్ల్ ఫ్రెండ్' ఓటీటీలోకి రావడానికి సిద్ధమవుతోంది. థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో డిసెంబర్ 05 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, మరియు హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ సినిమాకు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించగా.. దీక్షిత్ శెట్టి కథానాయకుడిగా నటించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. భూమా (రష్మిక మందన్న) పీజీ చేయడానికి హైదరాబాద్ లోని ఓ కాలేజ్ లో జాయిన్ అవుతుంది. అదే కాలేజ్ లో పీజీ చేయడానికి వచ్చిన విక్రమ్ (దీక్షిత్ శెట్టి) భుమాని ఇష్టపడతాడు. ఒక బలహీనమైన క్షణంలో భూమా కూడా విక్రమ్ ని ఇష్టపడుతుంది. విక్రమ్ కి జెలసీ, పోసిస్సివెన్స్ ఎక్కువ. తనది పాత కాలం మనస్తత్వం. విక్రమ్ తో రోజులు గడుపుతున్నకొద్దీ భూమాకి కొన్ని విషయాలు అర్ధమౌతూవస్తుంటాయి. రిలేషన్షిప్ లో ఓ చిన్న బ్రేక్ కావాలని ఆడుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది? విక్రమ్ ఎలా రియాక్ట్ అయ్యాడు ? ఈ కథలో దుర్గా (అను ఇమ్మానుయేల్) పాత్ర ఏమిటి? చివరికి భూమా ఎలాంటి నిర్ణయం తీసుకుందనేది మిగతా కథ.



# కెరీర్‌లో తొలిసారి.. ఘోస్ట్‌గా కనిపించబోతున్న దీపికాపదుకొనే!

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో వన్ ఆఫ్ లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగుతున్న భామల్లో టాప్‌లో ఉంటుంది బాలీవుడ్ నటి దీపికా పదుకొనే ప్రభాస్‌తో కల్కి 2898 ఏడీలో మెరిసిన ఈ బ్యూటీ సీక్వెల్‌లో నటించేందుకు మాత్రం నో చెప్పిందని తెలిసిందే. దీంతోపాటు సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో రాబోతున్న స్పిరిట్ ఆఫర్‌ను కూడా వద్దని చెప్పింది. ఈ భామ కెరీర్‌లో తొలిసారి డిఫరెంట్ రోల్ చేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలువనుందన్న వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ తెరకెక్కించనున్న రెండు కొత్త ప్రాజెక్టుల్లో దీపికా పదుకొనే బెంగాలీ ఘోస్ట్ (దెయ్యం) శాఖ్చునిగా కనిపించనుందట. ఈ బ్యానర్‌లో మ్యాడ్ డాక్ హార్రర్ కామెడీ యూనివర్స్ సూపర్ పాపులారిటీ ఉందని తెలిసిందే. తాజా టాక్ ప్రకారం ఈ టాప్ బ్యానర్ ఇటీవలే రెండు సినిమాల కోసం దీపికాపదుకొనేను సంప్రదించాయట. అయితే నిర్ణయం తీసుకోవాలంటే మొత్తం స్క్రిప్ట్ కావాలని అడిగినట్టు బీటౌన్ సర్కిల్ సమాచారం. ఇప్పటివరకు అధికారిక ప్రకటన ఏం రాకున్నా.. తాజా వార్తలు గమనిస్తే దాదాపు ఈ సినిమాలు ఫైనల్ అయినట్టేనని అర్థమవుతోంది. ఒకవేళ ఇదే నిజమైతే దీపికా పదుకొనే కెరీర్‌లోనే ఇది కొత్త చాప్టర్ కానుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాజా ప్రాజెక్టులతో మ్యాడ్ డ్యాక్ ఫిలిమ్స్ హార్రర్ కామెడీ యూనివర్స్ మరింత విస్తరించనుందని అర్థమవుతోంది. దీపికాపదుకొనే ప్రస్తుతం ఆట్లీ–అల్లు అర్జున్ కాంబోలో రాబోతున్న ప్రాజెక్టులో నటిస్తోంది. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది.

# నిర్మాతగా కిరణ్ అబ్బవరం.. లవ్ సాంగ్ వచ్చేసింది!




టాలీవుడ్ హీరో కిరణ్ అబ్బవరం నిర్మిస్తోన్న తాజా చిత్రం తిమ్మరాజుపల్లి టీవీ. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ పీరియాడికల్ మూవీలో కెమెరా అసిస్టెంట్‌గా పనిచేసిన సాయితేజ్ హీరోగా నటిస్తున్నారు. కేఏప్రోడక్షన్స్ పతాకంపై ఈ మూవీని నిర్మిస్తున్నారు. కిరణ్ అబ్బవరం గత చిత్రాలకు ఆన్‌లైన్ ఎడిటింగ్ చేసిన వి. మునిరాజు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి క్రేజీ సాంగ్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. చిన్ని చిన్ని అంటూ సాగే ఫస్ట్ సింగిల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. ఈ లవ్ అండ్ రొమాంటిక్ సాంగ్ ఆడియన్స్‌ను అలరిస్తోంది. ఈ పాటకు సనారే లిరిక్స్ అందించగా.. హరిణి ఇవటూరి, పవన్ కల్యాణ్ పాడారు. ఈ సాంగ్‌కు వంశీకాంత్ రేఖన సంగీతమందించారు. కాగా.. ఈ చిత్రంలో వేదశ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ మూవీలో ప్రదీప్ కొట్టె, తేజ విహాన్, స్వాతి కరిమిరెడ్డి, అమ్మ రమేశ్, సత్యనారాయణ వడ్డాది, మాధవి ప్రసాద్, టీవీ రామన్, చిట్టిబాబు ప్రధానపాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com